
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 6 మే 2025
5



ఆయిల్ పామ్ యాక్షన్ ప్లాన్ ఖరారు

- జిల్లాలో 14,500 ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- ఆయిల్‌పామ్ సాగుకు ఉద్యాన శాఖ ప్రోత్సాహం
- ప్రారంభమైన పరిశ్రమ నిర్మాణ పనులు
- గోద్రేజ్ ఆధ్వర్యంలో మరో ఫ్యాక్టరీ కూడా...



7



కొణిజర్లలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న ధాన్యం రైతులు

రోడ్డెక్కిన ధాన్యం రైతులు

- ఐకేపీ నిర్లక్ష్యంపై అన్నదాతల నిరసన
- కల్లూరు, కొణిజర్లలో రాస్తారోకో
- అధికారుల తీరుపై ఆగ్రహం

కల్లూరు/కొణిజర్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో ధాన్యం కొనుగోళ్లలో ఐకేపీ వైఖరిని నిరసిస్తూ సోమవారం కల్లూరు, కొణిజర్లలో రైతులు రోడ్డెక్కారు. కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కల్లూరులో రాష్ట్రీయ ప్రధాన రహదారిపై పుల్లయ్యబంజర రైతులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ పుల్లయ్యబంజరలో ఐకేపీ ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించి 40రోజులవుతున్నా.. కేవలం 4 రోజులు మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేశారని ఆరోపించారు. ఐకేపీ ఏపీఎం, సీసీని అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని పలువురు రైతులు పేర్కొన్నారు. ధాన్యాన్ని తూర్పారా పడితే ఎలాంటి కోత లేకుండా మిల్లులకు పంపిస్తామని ఐకేపీ వారు చెప్పినా.. మిల్లర్లు 3 కేజీల కోత విధించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేంటని ఐకేపీ ఏపీఎంను రైతులు ప్రశ్నిస్తే వ్యవస్థ అలా ఉందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఈదురు గాలి, అకాల వర్షాలతో రైతులు పలుసార్లు నష్టపోయినా.. గత్యంతరం లేక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుందామంటే మిల్లర్లు తేమ పేరుతో తరుగు పెట్టి నష్టపెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకున్నారు. ఈ మేరకు కల్లూరు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆందోళన చేస్తున్న రైతులకు స్థానిక ఎస్ఐ హరిత నచ్చజెప్పటంతో ఆందోళన విరమించారు.

కొణిజర్లలో ఆందోళన..

మండల కేంద్రమైన కొణిజర్లలోని ఓ మిల్లుకు పరిమితి అయిపోయిందని, ధాన్యాన్ని దింపుకోవద్దని ఓ జిల్లా అధికారి మిల్లు యాజమానికి సూచించడంతో ఆగ్రహించిన రైతులు మిల్లు సమీపంలోని రహదారిపైకి వచ్చి ఆందోళన నిర్వహించారు. కొణిజర్లలోని (మిగతా 6వ పేజీలో)

జిల్లాలో వ్యవసాయానికి ఆయువుపట్టు అయిన నాగార్జున సాగర్ కాల్వల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఎన్నెస్పీ ఆయకట్టులో వరిసాగుకు అత్యంత ప్రధానమైన ఈ కాల్వలను పట్టించుకునే నాథుడు లేక ఆయకట్టు చివరి భూములకు నీరందే పరిస్థితి కనిపించడం లేదు. అనేకచోట్ల ప్రధాన కాల్వతో పాటు లింక్ కాల్వల్లో పూడిక పేరుకుపోయింది. కాల్వల్లో చెట్లు, చెత్త పేరుకుపోయి నీరు ముందుకు కదిలే పరిస్థితి లేదు. గత వర్షాకాలం సీజన్‌లో పాలేరు నుంచి ప్రధాన కాల్వకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. దాంతో ఆ సమయంలో వాటికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కానీ పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టలేదు. మరో నెల రోజుల్లో వానాకాలం సాగుసీజన్ ప్రారంభం కాబోతున్నా.. కాల్వల మరమ్మతులపై ఎన్నెస్పీ అధికారులు దృష్టి పెట్టలేదు.



కోతకు గురైన మధిర బ్రాంచి కాల్వ

సాగు మార్గమేదీ?

పూడిక, పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఎన్నెస్పీ కాల్వలు

- గత వానాకాలం సీజన్‌లో పలుచోట్ల కాల్వలకు గండ్లు
- తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టిన వైనం
- ఎన్నో ఏళ్లుగా శాశ్వత మరమ్మతులు కరువు
- మరో నెలరోజుల్లో ప్రారంభమవుతున్న వానాకాలం సాగు సీజన్
- మరమ్మతులు చేయకపోతే చివరి ఆయకట్టుకు కష్టకాలమే..



ఏన్కూరు వద్ద ముళ్లచెట్లతో నిండిన సాగర్ మెయిన్ కాలువ

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, మే 5: సాగర్ కాల్వలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. కాల్వలకు గండ్లు పడి ఏడాది అవుతున్నా.. మరమ్మతులపై ఎన్నెస్పీ అధికారులు దృష్టి సారించలేదు. మరో నెలరోజుల్లో సీజన్ ప్రారంభం కానుండడంతో ఇప్పటికైనా మరమ్మతు పనులు ప్రారంభించాలి. వానాకాలం మొదలైతే కాల్వల మరమ్మతులకు అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో వేసవిలోనే ప్రధాన ఎడమ కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీ కాల్వల మరమ్మతులకు అధికార యంత్రాంగం చొరవ చూపించాలి. వానాకాలం లోపు కాల్వలకు మరమ్మతులు చేపట్టకపోతే ఖరీఫ్‌లో సాగునీరు అయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా మండలాల్లో సాగర్ కాలువల పరిస్థితి 'ఆంధ్రజ్యోతి' పరిశీలనాత్మక కథనం ఇదీ..

కల్లూరు మండలంలో..

జల వనరులశాఖ కల్లూరు సర్కిల్ పరిధిలో సాగర్ ఎడమకాల్వ పరిధిలో పూడిక, తూటికాడ విపరీతంగా పెరిగింది. దీంతో సాగర్ ఆయకట్టు చివరి భూములకు సకాలంలో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు కాల్వ కట్టలపై విపరీతంగా తుమ్మ చెట్లు పెరగటంతో రైతుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సర్కిల్ పరిధిలో సాగర్ కాల్వ కట్టలు పలు ప్రదేశాల్లో బలహీనంగా మారాయి. ప్రధానంగా పూడిక, తూటికాడ పేరుకున్నందున కాల్వల పరిధిలో స్థిరీకరించిన ఆయకట్టుకు తగ్గట్టుగా సాగునీరు సరఫరా చేయటం అధికారులకు సమస్యగా మారుతోంది. కల్లూరు జలవనరుల శాఖ సర్కిల్ పరిధిలో కల్లూరు, మధిర, సత్తుపల్లి డివిజన్లు విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలో సాగర్ ఎడమకాల్వతో పాటుగా అనుసంధానంగా బోనకల్, మధిర బ్రాంచి కాల్వలు విస్తరించి ఉన్నాయి. 15 ఏళ్ల క్రితం చేసిన ఆధునికీకరణ పనులు తప్ప ఆ తరువాత కాలంలో నామమాత్రంగానే పనులు చేశారు. ఇక కాల్వల్లో పూడిక, తూటికాడ పేరుకుపోవటంతో చివరి భూములకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. గతంలో ప్రపంచ బ్యాంకు నిధులతోనే ఆధునికీకరణ పనులు జరిగాయి. ఆ తరువాత కాలంలో పనులు జరగక సంవత్సరాల తరబడి ప్రధాన కాల్వ, మేజర్లు, మైనరు కాల్వలు మరమ్మతుల కోసం నిరీక్షిస్తున్నాయి.

ఏన్కూరు మండలంలో..

ఏన్కూరు మండలంలో సాగర్ ప్రధాన కాలువ ముళ్లచెట్లతో నిండిపోయింది. కాల్వకట్టలపై రైతులు పొలాలకు వెళ్లడానికి వీలులేకుండా పోయింది. ఏన్కూరు మండలంలో సాగర్ కాలువ మూలగూడెం నుంచి మేడేపల్లి వరకు 22 కి.మీ విస్తరించి ఉంది. గిన్నెలవాగు, బుగ్గవాగు, గండివాగుపై ఉన్న యూటీలు దెబ్బతిన్నాయి. కాలువ కట్టలు కూడా బలహీనపడ్డాయి. సిరిపురం నూకాలంపాడు, టీఎల్‌పేట, (5వ పేజీ తరువాయి)



నేడు, రేపు జిల్లాలో మంత్రుల పర్యటన

- నేడు రెవెన్యూ మంత్రి పొంగులేటి
- రేపు వ్యవసాయ మంత్రి తుమ్మల
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

ఖమ్మం కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన ఉదయం 10గంటలకు కూసుమంచి మండలం నేలపట్ల గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. 10.30కి మల్లెపల్లి గ్రామంలో సీసీ రోడ్లకు, 11గంటలకు ఎస్సీ కాలనీ జక్కేపల్లిలో సీసీ రోడ్లు, 11.30కి పాలేరులో సూర్యాపేట, అశ్వారావుపేట రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. 12గంటలకు ఎస్సార్ ఫంక్షన్‌హాల్లో కూసుమంచిలో పార్టీ మీటింగ్‌లో పాల్గొంటారు. ఆ తర్వాత 1.30కి ఎమ్మెల్యే క్యాంపు (మిగతా 6వ పేజీలో)

సారూ.. మారదా తీరూ!

- డ్యూటీ చేస్తే చెయ్.. లేదంటే శాఖాపరమైన చర్యలు
- ఇటీవల కాలంలో 60మంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు
- తాజాగా భద్రాచలం-రాజమండ్రి సర్వీసు మస్టర్ల కుదింపునకు యత్నం
- ఎమ్మెల్యేకే మాట ఇచ్చి మరిచిన సదరు అధికారి
- భద్రాచలం డిపోలో పని ఒత్తిడితో డ్రైవర్లకు అవస్థలు



భద్రాచలం, మే 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఆర్టీసీ డిపో పరిధిలోని ఉద్యోగులపై ఓ కీలక అధికారి తన ప్రతాపం చూపిస్తూ డిపో డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు ఆర్టీసీ వర్గాల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి వచ్చిన నాటి నుంచి మస్టర్ల కుదింపు, చిన్న చిన్న ప్రమాదాలకు సైతం డ్రైవర్లపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు విమర్శలున్నాయి. పని ఒత్తిళ్లతో ఇబ్బందుల పాలవుతున్నా తమకు ఊరట, భరోసా ఇచ్చే వారే కరువయ్యారని ఉద్యోగులు వాపోతున్నారు. గతంలో భద్రాచలం, బీహెచ్ఈఎల్ సర్వీసుల విషయంలో సదరు అధికారి వ్యవహరించిన తీరుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ విషయాలపై 'ఆంధ్రజ్యోతి'లో సైతం వరుస కథనాలు వెలువడ్డాయి. అయితే ఇటీవల కాలంలో సదరు అధికారి తీసుకుంటున్న, తీసుకోబోతున్న చర్యలపై ఆర్టీసీ ఉద్యోగుల్లో మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది. పొరపాటున డ్రైవర్ వల్ల బస్సుకు చిన్న నష్టం జరిగినా.. డ్రైవరు నుంచి రికవరీ చేయడంతో పాటు ఆరు నెలలు ఇంక్రిమెంట్లు నిలిపివేస్తున్నట్టు సమాచారం. ఇటీవల కాలంలో సుమారు 60మంది ఉద్యోగులపై వివిధ రకాల ఆరోపణలతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా డిపోలో ఒక కీలక పోస్టులో గతేడాది ఆగస్టు 9న సంస్థ నియమ నిబంధనలను జీవో ద్వారా తెలియజేసి చివరకు అర్హతలున్న వారిని పక్కన బెట్టి అనర్హుడిని ఆ పోస్టులో నియమించడం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వినిపించాయి. తాము ఈ విషయంలో ఎంతో నిరుత్సాహానికి గురవుతున్నామని పలువురు ఉద్యోగులు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా.. నేటికీ ఆ విషయంపై అధికారులు దృష్టిసారించకపోవడం పట్ల ఆర్టీసీ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

400 కి.మీ.కు ఒకే డ్రైవరట..

భద్రాచలం నుంచి విశాఖపట్నం వెళ్లే లహరి బస్సును ఒకే ఒక్క డ్రైవరు నడపాల్సిన పరిస్థితి నెలకొంది. రానుపోను 800 కి.మీ ఒకే డ్రైవరును పంపిస్తున్నారు. వాస్తవానికి ఒక డ్రైవరు రోజుకు 240 కి.మీ మాత్రమే నడపాల్సి ఉంటుందని ఆర్టీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. 12 గంటలు డ్యూటీ చేస్తే రెండు రోజుల మస్టర్‌గా భావించాల్సి ఉంటుందని సమాచారం. కానీ భద్రాచలం నుంచి (మిగతా 6వ పేజీలో)



జీఎం పర్సనల్ కవితానాయుడుకు సమ్మెనోటీసు అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికసంఘాల నాయకులు

సింగరేణిలో సమ్మె సైరన్

20న సమ్మెకు సన్నద్ధమవుతున్న కార్మికసంఘాలు

రుద్రంపూర్(సింగరేణి), మే 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో సమ్మె సైరన్ మోగనుంది. 20న సింగరేణి వ్యాప్తంగా ఓపెన్‌కాస్టులు, మైన్స్, డిపార్టుమెంట్‌లలో సమ్మె చేసేందుకు కార్మికవర్గాలు సన్నద్ధమవుతున్నాయి. నూతన బొగ్గు గనుల ఏర్పాటు, 4 లేబర్‌కోడ్‌లను రద్దు యోచన మానుకోవాలని, సమాన పనికి సమాన వేతనంతో పాటు 17 రకాల డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె నిర్వహించేందుకు కార్మికసంఘాలు సిద్ధమవుతున్నాయి. 20న సమ్మె నిర్వహిస్తామని పలు కార్మికసంఘాల ప్రతినిధులు సోమవారం సింగరేణి సీఎండీ ఎన్.బలరాంకు సమ్మె నోటీసు అందజేశారు. డిప్యూటీ లేబర్ కమిషనర్ (సెంట్రల్) డి.శ్రీనివాసులుకు సైతం సమ్మె నోటీసును ఇచ్చినట్లు కార్మికసంఘాల నాయకులు రియాజ్ అహ్మద్, సీతారామయ్య, గట్టయ్య. (మిగతా 6వ పేజీలో)

8న ఖమ్మం మెడికల్ కళాశాల

భవనాలకు శంకుస్థాపన

- హాజరుకానున్న పలువురు మంత్రులు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఆస్పత్రిలో వివిధ నిర్మాణ పనులపై సూచనలు ఇస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల శాశ్వత భవనాలకు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈనెల 8న శంకుస్థాపన చేయనున్నారు. ఆయనతో పాటు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం. మంత్రుల పర్యటన కోసం జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ రఘునాథపాలెం వద్ద ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవన నిర్మాణ (మిగతా 6వ పేజీలో)



రైతులకు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఏవో

ప్రతి రైతుకు గుర్తింపు కార్డు

రఘునాథపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ ఐడీ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు కార్డును పంపిణీ చేయటం జరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలం వీవీపాలెంలో రైతు గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమాన్ని స్థానిక ఏఈవో శిరణ్మయితో మాట్లాడి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి రైతుకు 11 నెంబర్లతో కూడిన ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వటం జరుగుతుందన్నారు. ఆ రైతుకు సంబంధించిన భూమి వివరాలు, భూమి రకం, సాగు, వ్యక్తిగత వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేయటం జరుగుతుందన్నారు. మే 5నుంచి జూన్ 5వరకు నెల రోజులు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అమలు జరుగుతున్న రైతు ఐడీ కార్డుల పంపిణీ ద్వారా రైతులకు భవిష్యత్‌లో అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. రైతులు స్వచ్ఛందంగా గ్రామంలోని వ్యవసాయ అధికారిని సంప్రదించి తమ వివరాలను నమోదుచేసుకోవాలని సూచించారు.

ప్రక్షాళన దిశగా పారిశుధ్యం

- ఖమ్మంలో పారిశుధ్య పర్యవేక్షణ బాధ్యతలు వార్డు ఆఫీసర్లుకు
- జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల హాజరు పరిశీలన బాధ్యతలూ వారికే
- బినామీ కార్మికుల్లో కలవరం సృష్టించిన ఆంధ్రజ్యోతి కథనం
- పారిశుధ్యంలో అవినీతి కంపు కథనంపై స్పందించిన నగర కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో పారిశుధ్యం ప్రక్షాళన దిశగా ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. పారిశుధ్య కార్మికుల్లో బినామీలు పెరిగిపోవటంతోపాటుగా జవాన్లు, శానిటరి ఇన్స్‌పెక్టర్ల వ్యవస్థపై అవినీతి ఆరోపణలు రావటంతో కమిషనర్ తీవ్రంగా స్పందించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పారిశుధ్యంలో అవినీతి కంపు కథనం ఖమ్మం నగర పాలక సంస్థలోని బినామీ కార్మికుల్లో సంచలనం సృష్టించింది. కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు ఆంధ్రజ్యోతి కథనాన్ని ఆదారంగా చేసుకుని అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా విచారణ చేపట్టారు. దీంతో అనేక డివిజన్లలో బినామీ కార్మికులు పనిచేస్తున్నారని, తల్లిదండ్రులు బయో మెట్రిక్ హాజరు వేసి ఇంటికి వెళ్తే వారి పిల్లలు లేదా బంధువులు వచ్చి కొద్ది సేపు పారిశుధ్య పనుల చేసి వెళ్తుండడాన్ని అధికారులు గుర్తించారు. నెలల తరబడి పారిశుధ్య విధులకు డుమ్మాకొట్టి వేతనాలు పొందుతున్న వారి జాబితాలను తయారు చేస్తున్నారు. బినామీ కార్మికులకు సహకరించిన జవాన్లు, శానిటరి ఇన్స్‌పెక్టర్లపై చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో నగరంలోని 60 డివిజన్లలో పారిశుధ్య కార్మికుల పేర్ల వారీగా పరిశీలన ప్రారంభించారు.

వార్డు ఆఫీసర్లకు పారిశుధ్య బాధ్యతలు

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై పలు కీలక ఆదేశాలిచ్చారు. వారంలో మూడు రోజులు పాటు వార్డు ఆఫీసర్లు ఉదయం 5.30గంటలకు పారిశుధ్య ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ప్రతి రోజు జవాన్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, డివిజన్లలో పారిశుధ్య కార్మికుల హాజరు తనిఖీలు చేయాలన్నారు. కేఎంసీ ఎవరికైతే ఉద్యోగం ఇచ్చిందో వారు మాత్రమే పారిశుధ్య పనులు చేయాలని, ఆలా చేయకుండా వెరే వాళ్లను ఆ పనులకు పంపిస్తే వారిపై ఖచ్చితమైన నివేదికలు ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందున్న ఖమ్మం నగర పాలక సంస్థ పారిశుధ్యంలో కూడా ఆదర్శంగా ఉండేలా వార్డు ఆఫీసర్లు బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఎవరికి కేటాయించిన డివిజన్లకు వారే కమిషనర్లుగా పని చేయాలని, ఎవ్వరైనా మాట వినకుంటే తనకు వెంటను తెలియజేయాలని హెచ్చరించారు.

బాలుకు గద్దర్ ఐకాన్ అవార్డు ప్రదానం



ఐకాన్ అవార్డు అందుకుంటున్న బాలు

తల్లాడ, మే 5 (ఆంధ్రజ్యోతి): గద్దర్ ఐకాన్ అవార్డును ప్రముఖ కవి, గాయకుడు కాంపల్లి బాలు అసెంబ్లీస్పీకర్ గడ్డం ప్రసాద్ చేతులమీదుగా అందుకున్నారు. బాలు ఉద్యమపాటలు, జానపదపాటలు రాస్తూ, పాడుతూ తెలంగాణ, ఏపీ, చత్తీష్‌గడ్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో తన బృందంతోప్రదర్శనలు ఇచ్చారు. ఇందకుగాను బాలు కు హైదరాబాదులోని బిర్లా సైన్సు భాస్కర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్ అవార్డునుప్రదానం చేశారు. కార్యక్రమంలో వెన్నెల, విమలక్క పాల్గొన్నారు.

సీసీఎస్ ఎస్‌ఐకు రియల్ హీరోస్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్‌ఐ జె.ప్రవీణ్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిసిఎస్ ఎస్‌ఐ జె.ప్రవీణ్‌కు రియల్ హీరోస్ అవార్డు వరించింది. సోమవారం హైదారాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా తెలంగాణ పోలీస్ రియల్ హిరోస్ పురస్కారం అందుకున్నారు. ప్రజల కోసం ప్రాణాలు సైతం పణంగా పెట్టి 24 గంటలు కష్టపడుతున్న పోలీసుల సేవలను గుర్తించి వారికి ఓ న్యూస్ ఛానల్ ఈ వార్డులను ప్రకటించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి పోలీసులకు అవార్డులను ప్రదానం చేశారు.

అవార్డు అందుకున్న కానిస్టేబుల్ నరేష్



సత్తుపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడిని వెంబడించి పట్టుకునే ప్రయత్నంలో సదరు నిందితుడు కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచినా వెనక్కి తగ్గకుండా నిందితుడిని పట్టుకున్న సత్తుపల్లి కానిస్టేబుల్ నరేష్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం

ఇల్లెందు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తోందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రకటించారు. సోమవారం ఇల్లెందు ఆర్టీసీ డిపోకు నూతనంగా వచ్చిన 8బస్సులను ప్రారంభించారు. ఇల్లెందు డిపో నుంచి మణుగూరు, సత్తుపల్లి కేంద్రాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు వెల్లడించారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలకు ఎంతో ఆర్థిక చేయూత అందుతుందని ప్రశంసించారు. ఇల్లెందు డిపోకు పలు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏజెన్సీ కేంద్రమైన ఇల్లెందు డిపోను మరింతగా అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మారుమూల ప్రాంతాలకు పూర్తిస్థాయిలో రవాణా సౌకర్యం కల్పించేందుకు పలు ప్రణాళికలను ఇప్పటికే రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇల్లెందు డిపో నుంచి కొమారం, శెట్టుపల్లి మీదుగా గుండాలకు సింగరేణి ప్రాంతాలైన మణుగూరు, సత్తుపల్లి బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మరి కొన్ని ప్రాంతాలకు ఇల్లెందు డిపో నుంచి రవాణా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నూతనంగా ఇల్లెందు డిపోకు రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులు, ఆరు పల్లెవెలుగు బస్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కొత్తగూడెం డిపో మేనేజరు దేవేంద్రగౌడ్, ఇల్లెందు డిపో ఇంచార్జీ కుంజా సునిత, ఎపీఎఫ్ ఎన్‌వి. నారాయణ, ఎన్. శ్రీనివాస్, కొరళ్ల రామనర్సయ్య, నాగరాజు, కాంగ్రెస్ నాయకులు దొడ్డా డానియేలు, గందె సదానందం, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, బొళ్ల సూర్యం, మాజీ కౌన్సిలర్లు కొక్కు నాగేశ్వరరావు, బాదావత్ సరోజ తదితరులు పాల్గొన్నారు.



జెండాఊపి బస్సులను ప్రారంభించిన కోరం కనకయ్య

ఇల్లెందు ఏరియాలో సెక్యూరిటీ జీఎం పర్యటన

ఇల్లెందు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియాలో సోమవారం సెక్యూరిటి జీఎం లక్ష్మీనారాయణ పర్యటించారు. ఇల్లెందు, కోయగూడెం చెకిపోస్టులను పరిశీలించారు. అదేవిధంగా సెక్యూరిటి కార్యాలయాన్ని సందర్శించారు. ఏరియా పర్యటనకు వచ్చిన సెక్యూరిటి జీఎం లక్ష్మినారాయణకు సింగరేణి గుర్తింపు సంఘం ఎఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేశారు. సెక్యూరిటి గార్డులందరికి పేడేలు వర్తింపచేయాలని, చెకిపోస్టుల్లో ఏసీ సౌకర్యం కల్పించాలని, శాశ్వతంగా చెక్ పోస్టులను నిర్మించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. వినతిపత్రం అందచేసిన వారిలో ఎఐటీయూసీ ఫిట్ కార్యదర్శి దాట్ల వెంకటేశ్వర్లు, ఎస్ రవి, నజీరుద్దీన్, సురేష్, మురహరి, సాంబయ్య తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందచేస్తున్న ఏఐటీయూసీ ప్రతినిధి బృందం

పవర్ లిఫ్టింగ్‌లో భద్రాద్రికి పతకాలు

చుంచుపల్లి/ భద్రాచలం, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భద్రాద్రి జిల్లాకు మూడు పథకాలు వరించాయని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జీవీ రామిరెడ్డి సోమవారం తెలిపారు. హైదారాబాద్‌లోని మేడ్చేల్ ప్రాంతంలో ఇటీవల ముగిసిన స్టేట్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రెండు బంగారు పథకాలు, ఒక రజత పథకం వరించాయి. పథకాలు సాధించిన వారిలో భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌లో పవర్ లిఫ్టింగ్ ప్రాక్టీసర్ డివి.శంకర్‌రావు మాస్టర్ -4 విభాగంలో 83 కేజీల కేటగిరిలో, స్క్వాట్ -60 కేజీలు, బెంచ్ ప్రెస్-55 కేజీలు డెడ్ లిఫ్ట్-100 కేజీలు, మొత్తంగా 215 కేజీల బరువెత్తి బంగారు పతకాన్ని సాధించారు. అదే విధంగా మాస్టర్ -2 కేటగిరిలో 74 కేజీల విభాగంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కోశాధికారిగా ఉన్న మహంతి వెంకటకృష్ణ రజతపతకం, మణుగూరుకు చెందిన పి.పాండు రాజు 53 కేజీ జూనియర్ విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ గెలుపొందిన క్రీడాకారులను భద్రాద్రి జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు బోగాల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.మల్లేష్, తాండ్ర వెంకటరమణరావు, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు తదితరులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

అటవీ ఉత్పత్తులను జీసీసీలో అమ్ముకోవాలి

- కేంద్రాన్ని ప్రారంభించిన బ్రాంచ్ మేనేజర్ నర్సింహరావు

ఆళ్లపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గ్రామాల్లో అటవీ ఉత్పత్తులను సేకరిస్తున్న వారు స్థానిక జీసీసీ కొనుగోలు కేంద్రాల్లో ఆయా ఉత్పత్తులను అమ్ముకొని లాభాలు అర్జించాలని ఇల్లందు జీసీసీ బ్రాంచ్ మేనేజర్ నర్సింహరావు తెలిపారు. సోమవారం ఆయన ఆళ్లపల్లి, మర్కోడు గిరిజన సహకార సంస్థలో అటవీఉత్పత్తుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జీసీసీలో ఇప్పపువ్వు రూ.30లు, ఇప్పబద్ద రూ.29లు లకు కొనుగోలు చేస్తామన్నారు. దీంతో పాటు కుంకుళ్లు, ముష్టిగింజలు, కరక్కాయ్య, కానుగ ఇతర ఉత్పత్తులను కొనుగులు చేస్తామన్నారు. రేషన్ బియ్యం అమ్ముకున్నవారి రేషన్ కార్డు రద్దుచేయడంతో పాటు, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం జీసీసీ అకౌంటెడ్ ఖయ్యూం, సేల్స్ మెన్లు లక్ష్మయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

సారూ.. మారదా తీరూ!

(5వ పేజీ తరువాయి)

విశాఖపట్నం వెళ్లే సమయంలో డ్రైవర్ నిద్రను సైతం ఓర్చుకొని బలవంతంగా కళ్లను నీళ్లతో కడుక్కొని టీ తాగి మళ్లీ డ్రైవింగ్‌ను నిర్వహిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. కాగా ఏపీ బస్సులకు కాకినాడ-భద్రాచలం సర్వీసు 230 కి.మీ. దూరం ఉండగా ఐదున్నర గంటల ప్రయాణానికి అక్కడి డిపో అధికారులు ఇద్దరు డ్రైవర్లను ఏర్పాటు చేస్తున్నారు. మరి భద్రాచలం నుంచి విశాఖపట్నానికి 400 కి.మీ.కు ఒకే డ్రైవరు బస్సు నడిపే సామర్థ్యం ఉంటుందా అనేది అధికారులకే తెలియాలని ప్రయాణికులు వాపోతున్నారు. అలాగే భద్రాచలం-రాజమండ్రి రెండు ట్రిప్పులు నడిపితే మూడు రోజుల మస్టర్ ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం మాత్రం భద్రాచలం నుంచి రాజమండ్రి వెళ్లి, మళ్లీ భద్రాచలం నుంచి ఖమ్మం ట్రిప్ వేస్తే (600 కి.మీ.) రెండు రోజుల డ్యూటీ మస్టర్‌గా గుర్తించేందుకు కసరత్తు చేపడుతున్నట్లు ఆర్టీసీ వర్గాల ద్వారా సమాచారం. ఈ విధంగా చేయడం వల్ల డ్రైవర్లు మానసిక ఒత్తడికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యేకే మాటిచ్చి మరిచిన ఆ అధికారి

భద్రాచలం బీహెచ్‌ఈఎల్, కూకట్‌పల్లి సర్వీసులను గతంలో హైదరాబాద్ ఎంజీబీఎస్ వరకు కుదించారు. దీంతో ప్రయాణికుల డిమాండ్ మేరకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఈ విషయమై ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఆ సర్వీసులను గతంలో మాదిరిగానే కొనసాగించాలన్నారు. ఈ సమయంలో ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు సర్వీసులను పునరుద్ధరిస్తామని పేర్కొన్న సదరు అధికారి నేటికీ ఆ మాటను నెరవేర్చకపోవడం గమనార్హం.. భద్రాచలానికి పక్కనే ఉన్న మణుగూరు, కొత్తగూడెం డిపోల నుంచి ఇప్పటికే అవే సర్వీసులు నడుస్తుండగా వారికి మూడు రోజుల మస్టర్‌ను ఇస్తున్నట్లు వినికిడి. మరి అక్కడ సాధ్యమైన మస్టర్ ఇక్కడ ఎందుకు సాధ్యం కాదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లపై రోడ్డెక్కిన రైతులు

(5వ పేజీ తరువాయి)

ఓ మిల్లుకు రైతులు వారం రోజుల నుంచి ధాన్యం తెస్తున్నారు. మిల్లు సామర్థ్యం 15వేల క్వింటాళ్లు మాత్రమే ఉందని, మిల్లు పరిమితి దాటుతుండడంతో ధాన్యం దింపుకోవద్దని మిల్లు యాజమానికి సోమవారం డీఎస్‌వో వచ్చి సూచించారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు ఆగ్రహించారు. ట్రక్ షీట్‌లో మిల్లుపేరు రాసి ఇచ్చి మరో మిల్లుకు పోవాలంటే ఎలా వెళ్లాలని రైతులు ఆగ్రహించి రోడ్డెక్కారు. రైతుల వచ్చిన డీఎస్‌వోను రైతులు బతిమలాడారు. అయినా అధికారులు అంగీకరించకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ప్రగతిశీల రైతుసంఘం జిల్లా నాయకులు కంకణాల అర్జున్‌రావు, సిపై పుల్లయ్య రైతుల వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. బొంతు రాంబాబు మాట్లాడుతూ కొనుగోలు కేద్రాల నుంచి ధాన్యం తరలించడానికి రోజుల సమయం పడుతోందని, తీరా రైస్‌మిల్లు దగ్గరు వచ్చాక నాలుగు రోజులైనా దిగుమతి చేసుకోపోతే రైతులు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సూరజ్, తహసీల్దార్ రాము, సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం మిల్లు వద్ద ఉన్న ట్రాక్టర్లలోని ధాన్యాన్ని దింపుకుంటామని, ఇక నుంచి సదరు మిల్లుకు ధాన్యాన్ని తీసుకరావద్దని అధికారులు సూచించారు. దాంతో రైతులు ఆందోళన విరమించారు.

8న ఖమ్మం మెడికల్ కళాశాల భవనాలకు శంకుస్థాపన

(5వ పేజీ తరువాయి)

ప్రదేశాన్ని పరిశీలించారు. వైద్య కళాశాల నూతన భవన నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. మంత్రులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శిస్తారని తర్వాత ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నూతన భవనాలకు శంకుస్థాపన పూర్తిచేసిన తర్వాత కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఆదనపు కలెక్టర్ డాక్టర్. పి.శ్రీజ, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి తనిఖీ చేశారు. ప్రధాన ఆస్పత్రిలోని పలు సమస్యలపై కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా ఆసుపత్రికి కావాల్సిన వైద్య పరికరాలు, సౌకర్యాలు, నిర్వహణ గురించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఏ విభాగం ఎక్కడ ఉంటుందో తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజేశ్వరరావు, సహాయ మున్సిపల్ కమిషనర్ షఫీయుల్లా, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్, ఆర్‌ఎంవో డాక్టర్ వినాయక్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

'సాగు' మార్గమేదీ.. ?



కొణిజర్ల వద్ద దెబ్బతిన్న లైనింగ్

(5వ పేజీ తరువాయి)

బురదరాఘవాపురం, తిమ్మరావుపేట, శ్రీరామగిరి మేజర్ కాలవలు కూడా దెబ్బతిన్నాయి. కాలవల్లో పూడికచేరి అధ్వాన్నస్థితిలో ఉన్నాయి.

ఖమ్మం రూరల్ మండలలో..

మండలంలోని ఎన్నెస్పీ కాల్వ కట్టకు మరమ్మతులు చేయకపోవడంతో కాలువకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి అల్లుకుపోతున్నాయి. దీంతో రైతులు, ప్రజలు కాల్వకట్టపై నడువలేని పరిస్థితి తలెత్తుతోంది. మండల పరిధిలోని తెల్దారుపల్లి నుంచి దానవాయిగూడెం వరకు కాలువకు ఇరువైపులా అద్వానంగా తయారైంది. తెల్దారుపల్లి గ్రామం సమీపంలోని కాలువపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనను తీసి నూతన వంతెనను నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాల్వకు ఇరువైపులా మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.



సిరిపురం మేజర్‌లో పెరిగిన కంపచెట్లు

కొణిజర్ల మండలంలో..

కొణజర్ల మండల పరిధిలో సాగర్ ఎడమ కాల్వ అధ్వాన్నంగా ఉంది. మండల పరిధిలోని 14వ కిలోమీటర్ నుంచి 27వ కిలోమీటర్ వరకు కాల్వ లోపల, కట్టలపై జంగిల్ విపరీతంగా పెరిగింది. కాల్వపై నాలుగుచోట్ల ఉన్న వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయి. ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వానాకాలం ప్రారంభమయ్యే లోపు ఈ సారైన సాగర్ ఎడమకాల్వకు మరమ్మతులు జరుగుతాయో లేదోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటే శిథిలావస్థలో ఉన్న వంతెనలు, జంగిల్‌కు మోక్షం లభించేదని, పట్టించుకునేవారు లేక కాల్వల నిండా చెట్లు పెరిగాయని రైతులు చెబుతున్నారు. 14వ కిలోమీటర్ వద్ద ఉన్న రెగ్యులేటర్ మెయిన్ షటర్లు దెబ్బతిన్నాయి. ఈ షటర్లను పూర్తిగా కిందకు దింపినా సుమారు 1,500 క్యూసెక్కుల నీరు బయటికి వెళుతూనే ఉంది. నీరు రాకముందే వాటిని మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు. కాల్వ కట్టలపై అక్రమంగా సాగుతున్న మట్టి తోలకాలను అధికారులు ఆపలేకపోతున్నారని, అలాంటివారు కాల్వల మరమ్మతులను ఏం పట్టించుకుంటారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సీజన్‌లోనైనా కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మధిరరూరల్‌లో..

మధిర మండలంలో సాగర్ ఆయకట్టు పరిధిలో ఎన్నెస్పీ కాలువల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. అనేక ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో కాలువలు అన్ని కంపచెట్లు తూటికాడతో నిండిపోయాయి. దీంతో కాలవల్లో నీరు పారే పరిస్థితి లేకుండా పోయిందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధిర బ్రాంచికెనాల్ పరిధిలోని 33వ కిలోమీటరు నుంచి 55వ కిలోమీటరు చిలుకూరు వరకు మధిర మండలంలో 22వ కిలోమీటర్లు పొడువనసాగర్ కాలువ ఉం ది. నిదానపురం, మధిర మేజర్ కాలువ పరిధిలో మైనర్‌కాలవలు ఉ న్నాయి. ఉమ్మడి ఏపీలో ఉన్నప్పుడు మాత్రమే ప్రపంచ బ్యాంకు నిధులతో సాగర్ కాల్వలకు మరమ్మతులు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వాలు మళ్లీ మరమ్మతులకు నిధులు కేటాయించలేదు. మధిర మండలంలో నాగవరప్పాడు నుంచి చిలుకూరు వరకు ఏ కాలువ చూసినా ముళ్ల కంచెతో నిండిపోయి చిట్టడివిని తలపిస్తున్నాయి. తూములు, షట్టర్లు ధ్వంసమయ్యాయి. కాల్వ కట్టలపై చెట్లు మొలిచి గుంతలుపడి అధ్వాన్నంగా మారాయి. కాలువలకు నీరు వదిలిన సమయంలో ఆ నీరు సక్రమంగా పారడంలేదని రైతులు వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

తల్లాడ మండలంలో

తల్లాడ మండలంలో ఎన్నెస్పీ కాలువలు అధ్వాన్నంగా ఉన్నాయి. మండలంలోని సిరిపురం, పుణ్యపురం, బస్వాపురం మేజర్ కాలవలు అధ్వాన్నంగా ఉండడంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువల్లో కంపచెట్లు పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. మూడుమేజర్ కాలువల పరిధిలో 20కిలోమీటర్ల పొడవునా కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి పూడిక పేరుకుపోయింది. సిరిపురం మేజర్ కాలువకు 170క్యూసెక్కుల నీరు విడుదల సామర్థ్యం ఉండగా కాలువ కట్టలు బలహీనంగా ఉండడంతో నీరు పొంగిపొతూ కాలువ కోతకు గురైంది. గోపాలపేట సమీపంలో సిరిపురం మేజర్ యూటీ శిథిలావస్థకు చేరుకుంది.

నేడు, రేపు జిల్లాలో మంత్రుల పర్యటన

(5వ పేజీ తరువాయి)

కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. సాయత్రం 4.20కి తల్లంపాడు గ్రామంలో సీసీరోడ్లు, 4.40కి పెద్దతండా గ్రామంలో డ్రెయిన్లు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్‌కు శంఖుస్థాపన చేస్తారు. ఆ తర్వాత కళ్యాణలక్ష్మీ చెక్కులను మంత్రి పొంగులేటి పంపిణీ చేస్తారు. సాయంత్రం 5.30కి గోళ్లపాడులో గోళ్లపాడు ఊటవాగుతండాకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6గంటలకు కరుణగిరిలో కేంద్రీయ విద్యాలయం రోడ్డుకు ట్రాఫిక్ సిగ్నళ్లకు, వీధిలైట్లకు శంకుస్థాపన చేస్తారు. 6.50కి శ్రీనగర్ కాలనీలో తన నివాసంలో బస చేస్తారు.

రేపు జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. 7న ఉదయం 10గంటలకు ఆయన 46వ డివిజన్‌లో సీసీరోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపన చేస్తారు. 10.30కి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 5గంటలకు రఘునాథపాలెంలో సొసైటీ భవనానికి కాంపౌండ్‌వాల్‌కు, సీసీ రోడ్లు డ్రెయిన్లకు, శంకుస్థాపన చేస్తారు. ఖమ్మం ఇల్లెందు రోడ్డుకు, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత మత్స్యశాఖ ద్వారా వారికి గుర్తింపు కార్డుల పంపిణీ చేస్తారు. 8న ఉదయం 10గంటలకు ప్రభుత్వ మెడికల్ కళాశాల శంకుస్థాపన అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. 11గంటలకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శిస్తారు. 11.30కి కలెక్టరేట్‌లో నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు.

సింగరేణిలో సమ్మె సైరన్

(5వ పేజీ తరువాయి)

రాములు, మణిరాంసింగ్, మహేందర్‌లు తెలిపారు. బొగ్గు బ్లాక్‌లను కేంద్ర ప్రభుత్వం సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. సంస్థ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో సింగరేణి కార్మికులు భాగస్వాములు కావాలని కోరారు. కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తూ లేబర్ కోడులను రద్దు చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఏడుకొండలు, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా 20వ తేదీన నిర్వహించే సమ్మెలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులు భాగస్వాములు కావాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య కోరారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో జీఎం(పర్సనల్) కవితానాయుడుకి సమ్మె నోటీసును అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల రాంచందర్, శ్రీను, రమణయ్య తదితరులున్నారు.

సీతారామ కాలువలో పడ్డ దంపతులు

- భార్య మృతి.. భర్తకు తీవ్ర గాయాలు
- బాధితులు కామేపల్లి మండల వాసులు

గార్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌పై వస్తున్న దంపతులు నిర్మాణంలో ఉన్న సీతారామ ప్రాజెక్టు కాలువలో పడి భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని రైల్వేగేటు సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం... ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నెమిలిపురి గ్రామానికి చెందిన సపావట్ బావ్‌సింగ్, భార్య విజయ(40) దంపతులు గార్ల మండలం తిర్లాపురం గ్రామంలో సోమవారం సాయంత్రం బంధువుల ఇంట్లో ఉన్న శుభకార్యానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని రైల్వేగేటు దాటాక నిర్మాణంలో ఉన్న సీతారామ కాలువలో ప్రమాదవశాత్తూ పడ్డారు. 40 అడుగుల లోతులో పడటంతో విజయ అక్కడికక్కడే మృతి చెందగా.. బావ్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని చూసిన స్థానికులు గార్ల పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని విజయ మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీశారు. గాయపడిన అతడిని 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకుని ఘటనాస్థలానికి చేరుకున్న విజయ కుమారుడు తల్లి మృతదేహం వద్ద పడి రోదించిన తీరు అక్కడి వారిని చలింపజేసింది. అయితే సీతారామ ప్రాజెక్టు కాలువ పనులు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫటాఫట్



ఏజెన్సీలో తునికాకు సేకరణ
గిరిజనులకు వరం

పోటాబత్తుల ఉపేందర్
ఫారెస్టు రేంజ్ అధికారి, మణుగూరు

ప్రశ్న: తునికాకు సేకరణ ప్రారంభించారా ?

జ: మరో రెండు మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. 45 రోజుల పాటు కొనసాగుతుంది. మొత్తం 25 కల్లాలు ఉన్నాయి. 1000 స్టాండెర్డ్ బ్యాగ్‌ల లక్ష్యంగా పనిచేస్తున్నాం.

ప్ర: గత ఏడాది లక్ష్యాన్ని సాధించారా. ?

జ: గత ఏడాది లక్ష్యానికి 75 శాతం మాత్రమే సాధించాం. ప్రూనింగ్‌కు సంబంధించి గత ఏప్రిల్ నెలలో పనులు పూర్తి చేశాం. అడవులు తగలబడటం వల్ల గుర్తింపు కష్టతరం అయింది.

ప్ర: తునికాకు సేకరణలో ప్రమాదాలకు గురైన వారికి బీమా వర్తింస్తుందా ?

జ: తునికాకు సేకరణ కార్మికులకు వేతన కార్డులతో పాటు ఇన్సూరెన్సు స్లిప్‌లు కూడా అందజేస్తున్నాం. ప్రమాదాలకు గురైన వారికి ఇన్స్‌రెన్స్ ప్రభుత్వం చెల్లిస్తుంది.

ప్ర: తునికాకు కట్ట ధర ఎంత ?

జ: 50 ఆకుల ధర మూడు రూపాయలు గా ప్రభుత్వం నిర్ణయించింది. రేంజ్ పరిధిలో అడవుల విస్తీర్ణం 19,744 హెక్టార్లుగా ఉంది. గొత్తికోయలు పోడు చేసి చాలా ఆక్రమించారు. ఆర్‌వోఎఫ్ ఆర్ కింద 2200 హెక్టార్ల భూమి ఆక్రమణలకు గురైంది. అడవుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. రేంజ్ పరిధిలో 11 గొత్తి కొయ గుంపుల్లో ఉన్న 600హెక్టార్ల భూమిలో 200 హెక్టార్ల భూమిని స్వాధీనం చేసుకుని మొక్కలను పెంచుతున్నాం

ప్ర: అడవుల సంరక్షణకు ప్రజాప్రతినిధులు సహకారం ఉందా ?

జ: ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారం ఎంతో ఉంది. ప్రత్యేకంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంపూర్ణంగా సహకరిస్తున్నారు. రాజకీయ నాయకులు సంపూర్ణంగా సహరిస్తే సంరక్షణ పూర్తి స్థాయిలో సాధ్యం అవుతుంది.

ప్ర: వన్య మృగ సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

జ: వేసవిలో వన్య మృగాల దాహం తీర్చేందుకు సోలార్ బోర్లు నిర్మించాం. వాటి ద్వారా నీటి తోట్లు, పెక్యూలేషన్ ట్యాంకులు నీటి గుంతల ద్వారా తాగు నీటిని అందిస్తున్నాం అడవీ ప్రాంతం అంతా సీసీ కెమెరాల నిఘాలో ఉంది.

-మణుగూరుటౌన్, ఆంధ్రజ్యోతి

‘ఆయిల్‌పామ్’ యాక్షన్ ప్లాన్ ఖరారు

- జిల్లాలో 14,500 ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- ఆయిల్‌పామ్ సాగుకు ఉద్యాన శాఖ ప్రోత్సాహం
- ప్రారంభమైన పరిశ్రమ నిర్మాణ పనులు
- గోద్రేజ్ ఆధ్వర్యంలో మరో ఫ్యాక్టరీ కూడా..

ఖమ్మం, మే 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉద్యానవనశాఖ ఈఏడాది ఖమ్మం జిల్లాలో భారీగా ఆయిల్‌పామ్ సాగుకు ప్రణాళిక సిద్ధంచేసింది. గతేడాది 11,500 ఎకరాలు లక్ష్యం పెట్టుకుని ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించగా ఈఏడాది 14,500 ఎకరాల్లో సాగుకు కార్యచరణ రూపొందించారు. జిల్లాలో వేంసూరు మండలంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పరిశ్రమ నిర్మాణ పనులు మొదలయ్యాయి. దీనికి తోడు కొణిజర్ల మండలం అంజనాపురంలో కూడా గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పరిశ్రమ రాబోతుంది. కంపెనీ పనులు చేపట్టింది.

ఏటికేడు పెరుగుతున్న విస్తీర్ణం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో భారీ ఆయిల్‌పామ్ పరిశ్రమలుండడంతో ఆజిల్లాలో ఆయిల్ పామ్ సాగు ఏడాదికేడాది ముందడుగు వేస్తోంది. ఖమ్మం జిల్లా పరిధిలో కూడా ఆయిల్‌పామ్‌ను భారీగా విస్తరించింది. వరి, పత్తి మిర్చి పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు ఉద్యానశాఖ రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నర్సరీ మొక్కలు, డ్రిప్ వంటి సదుపాయాలతో పాటు నాలుగేళ్లపాటు మిశ్రమ పంటలు వేసేందుకు అవసరమైన నగదు ప్రోత్సాహం కూడా అందించనున్నారు. జిల్లాలో పోడు భూముల కింద అటవీహక్కులు పొందిన రైతులు కూడా అధికంగా ఉండడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రైతులకు ఆయా కార్పొరేషన్ల నుంచి కూడా ఆర్థికసహకారం అందించేలా ఈసారి ప్రభుత్వ కార్పొరేషన్లు కూడా ఉద్యానశాఖ భాగస్వామ్యం చేస్తుంది.



మంత్రి తుమ్మల ప్రోత్సాహంతో..

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రోత్సాహంతో పాటు మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే ఆయిల్‌పామ్ సాగుకు పెద్దఎత్తున లక్ష్యం పెట్టుకుని ఆయిల్ పామ్ పంటను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తరింపచేస్తున్నారు. దీంతో ఖమ్మం జిల్లాలో కూడా అధికార యంత్రాంగం అన్ని మండలాల్లో ఆయిల్‌పామ్ పంటలు వేసి సాగర్‌ఆయకట్టు కింద కూడా ఆయిల్‌పామ్ ద్వారా రైతులకు లాభాలు చూసేలా ఆహార పంట వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు అధికారులు రైతులకు సూచనలు అందిస్తున్నారు.

ఉద్యాన శాఖ ప్రోత్సాహం..

పాలేరు, ఖమ్మం, మధిర, వైరా నియోజకవర్గాల్లో సాగర్ ఆయకట్టు రైతులకు కూడా ఈఏడాది ఆయిల్‌పామ్ సాగు కింద రైతులకు మొక్కలు పంపిణీ చేయబోతున్నారు. ఎకరానికి రూ.50వేల చొప్పున ఉద్యానశాఖ రైతులకు ప్రోత్సాహం అందిస్తుంది. ఇందులో రైతులకు మొక్కలకు సబ్సిడీతోపాటు ఏటా నాలుగేళ్లపాటు రూ.4200 చొప్పున మిశ్రమ పంటలకు నగదుతోపాటు ఉచితంగా డ్రిప్ సదుపాయాలు కల్పించనున్నారు.

మొక్కలకే ఎకరానికి రూ.11,900, డ్రిప్‌కు రూ.22వేలు వరకు ఖర్చవుతుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంవీ మధుసూదన్ ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు. జిల్లాలో గతేడాది 11,500 ఎకరాలు సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని 6,500 ఎకరాల వరకు ఆయిల్ పామ్ సాగుచేయడం జరిగిందని, ఈఏడాది లక్ష్యాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులతోపాటు రాబోయే రోజుల్లో కూడా ఆయిల్‌పామ్‌కు దేశవ్యాప్తంగా డిమాండ్ ఉందని తెలిపారు. ఆయిల్‌పామ్ నర్సరీతో పాటు విత్తనాభివృద్ధి కూడా త్వరలోనే గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యంలో కొణిజర్ల మండలంలో ఏర్పాటుచేయబోతున్నామని వివరించారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ తరుఫున అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తామని వివరించారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం

బుడతడు కాడు..

- గ్రహణశక్తిలో బాల మేధావి దేవ్రత్

మణుగూరుటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): బుడతడు కాదు చిచ్చర పిడుగని రెండున్నర సంవత్సర బాలుడు నిరూపించాడు. మణుగూరు మండలంలోని సమితి సింగారం గ్రామానికి చెందిన అనిపెద్ది సందీప్, నవ్యశ్రీ దంపతుల కుమారుడు ఆద్యంత్ ఎవ్వవన్ దేవ్రత్ 28 నెలల వయస్సులో అనన్యమైన గ్రహణశక్తిని పునికి పుచ్చుకున్నాడు. నోబెల్ ప్రపంచ రికార్డును కైవసం చేసుకున్నాడు. గ్రహాలు, జంతువులు, శరీర భాగాలు, రుతువులు, నెలలు, ప్రాసలు, విభిన్న ప్రాంతాలు, వేమన శతకాలు, శ్లోకాలు అనర్గళంగా పఠించే మేధా శక్తిని కలిగి ఉన్నాడు. ఈ బాలుడి ప్రతిభను ఏప్రిల్ 7వ తేదీన వీడియో తీసి నోబెల్ వరల్డ్ రికార్డు కార్యాలయానికి పంపగా, వారు దీన్ని గుర్తించి సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- వ్యకా. సం. జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్

ములకలపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలుచేయాలని వ్యవసాయ కార్మికసంఘం ఆలిండియా జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సోమరవారం మండల కేంద్రంలోని ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీటీ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో రేవతి, ఎవో అరుణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్రకమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య పాల్గొన్నారు.

మెరుగైన సాగు పద్ధతులు అవసరం

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించే దిశగా ఈ నెల 13వ తేదీ వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం చుంచుపల్లి మండలంలోని పెనగడపలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం లో ముగ్గురు రైతులకు ఎంచుకొని, వారిలో సుస్థిర వ్యవసాయంపై అవగాహన కల్పించాలని కలెక్టర్, శాస్త్రవేత్తల బృందాన్ని ఎమ్మెల్యే కోరారు. కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ రైతులు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వి.లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్త బి.శివ, ఏడీఏ నరసింహారావు, ఏవో రాజేశ్వరి, ఏఈవో మమత, సెక్రెటరీ హనుమంతరావు పాల్గొన్నారు.

పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో
అరుదైన నార్మల్ డెలివరీ

పాల్వంచ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం అరుదైన ఘటన చోటు చేసుకుంది. ఎదురుకాళ్లతో కవలలు ఉన్న గర్భిణికి మంత్రసాని దినోత్సవం రోజే సదరు మహిళకు నార్మల్ డెలివరీ చేసి సత్తా చాటారు. పాల్వంచ మండలం రేపల్లెవాడకు చెందిన జూపల్లి పల్లవి అనే మహిళ తన రెండో కాన్పు కోసం ఆస్పత్రికి రాగా వైద్యులు పరీక్షించి కవలలు ఉన్నారని చెప్పారు. మిడ్ వైఫ్ సుజాత గర్భిణికి తగు జాగ్రత్తలు సూచించింది. సుఖప్రసవం కోసం ఆస్పత్రిలోనే కొన్ని వ్యాయామాలు చేయించి శిక్షణ ఇచ్చింది. తరచుగా వ్యాయామాలు చేస్తూ సూచనలు పాటించిన పల్లవికి నార్మల్ డెలివరీ చేయించి ఇద్దరు పండంటి మగ పిల్లలకు జన్మనిచ్చే విధంగా సిబ్బంది కృషి చేశారు. క్లిష్టమైన పరిస్థితుల్లో ఎదురుకాళ్లతో కవలలు ఉన్న గర్భిణికి నార్మల్ డెలివరీ చేయడం చాలా కష్టతరమని, ప్రైవేటు ఆస్పత్రుల్లో అయితే ఆపరేషన్ తప్పనిసరి అవుతుందని వైద్య సిబ్బంది తెలిపారు. సాహసోపేతమైన ఇటువంటి డెలివరీ చేయడం అభినందించదగ్గ విషయమని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సదరు మిడ్ వైఫ్‌ను, సిబ్బందిని అభినందించారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- భద్రాద్రి జిల్లాలో 50 శిబిరాల ఏర్పాటు
- ఏఎంవో నాగరాజశేఖర్

జూలూరుపాడు/ అశ్వారావుపేట/దమ్మపేట, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అకాడమిక్ మానిటారింగ్ (ఏఎంఓ) అధికారి ఏ. నాగరాజశేఖర్ కోరారు. సోమవారం జూలూరుపాడులోని ఉన్నత పాఠశాల్లో ఏర్పాటుచేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో 50 ప్రభుత్వ పాఠశాలల్లో శిబిరాలను ఏర్పాటుచేసి విద్యార్థులకు వివిధ అంశాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పాపకొల్లు ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉచిత వేసవి శిబిరాన్ని ఎంఈవో జుంకీలాల్ ప్రారంభించారు. అశ్వారావుపేట పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, దమ్మపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. మే 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగే ఈ క్యాంపుల్లో పాల్గొనే విద్యార్థులకు ఇండోర్, ఔట్‌డోర్ ఆటలు, యోగ, మాల్గుడి కథలు, పెయింటింగ్స్ కళలు, సాంస్కృతిక కార్యక్రమాలులో శిక్షణ ఇస్తారు.

డీవోఏ చీఫ్ ప్యాట్రన్‌గా సాబీర్‌పాషా

కొత్తగూడెం, మే 5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషాను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్(డీవోఏ)చీఫ్ ప్యాటన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీవోఏ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి ప్రతిపాదించగా అన్ని క్రీడా సంఘాలు ఏకగ్రీంగా ఆమోదించాయి.

ఐఎన్‌టీయూసీ జిల్లా బాధ్యుల ఎన్నిక

భద్రాచలం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 327 జిల్లా సర్వసభ్యసమావేశం సోమవారం భద్రాచలంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికలు నిర్వహించారు. జిల్లా బాధ్యులుగా రామకృష్ణ, రాజేష్ ఎన్నికయ్యారు. పాల్వంచ డివిజన్ బాధ్యులుగా నరసింహారావు, కిరణ్ ఎన్నికయ్యారు. డివిజన్ బాధ్యులుగా సర్వేశ్వరరావు, అహ్మద్ ఎన్నికయ్యారు. కొత్తగూడెం డివిజన్ బాధ్యులుగా పూర్ణచంద్రరావు, రమేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీధర్ మాట్లాడుతూ విద్యుత్తు సంస్థలో ఉన్న సమస్యలపై యూనియన్ పోరాడుతూ ఉంటుందని ఈపీఎఫ్‌నుంచి జీపీఎఫ్ తో పాటు ప్రజల విషయాలపై మాట్లాడటం జరుగుతుందన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



కారేపల్లి, మే5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాంధీనగరం గ్రామానికి చెందిన 7వతరగతి విద్యార్థిని గలిగా రూపాశ్రీ(12)అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బాధితురాలికి ఇటీవల కాళ్ల చేతులకు స్పర్శ లేకపోవటంతో తండ్రి బాలకృష్ణ ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగెన వైద్యంకోసం హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు రూపాశ్రీకి వెన్నెముకకు క్యాన్సర్ ఉన్నట్లుగా నిర్ధారించారు. కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు వైద్యులు ఆపరేషన్ చేసి, ఇంటికి పంపారు. రెండు రోజుల క్రితం తిరిగి అస్వస్థతకు గురైంది. దీంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది.

ఎనిమిదిమంది
పేకాట రాయుళ్ల అరెస్టు

46 వేల నగదు, 8 సెల్‌ఫోన్లు, కారు, బైక్ స్వాధీనం

ఇల్లెందురూరల్,మే5(ఆంధ్రజ్యోతి):ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామ సమీపంలోని పాతపెంకు పరిశ్రమల్లో ఆదివారంరాత్రి పేకాట ఆడుతున్న 8మందిని ఇల్లెందు పోలీస్ సీఐ బత్తుల సత్యనారాయణ అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో పేకాట ఆడుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు వలపన్ని పట్టుకోని ఇల్లెందు పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారినుంచి రూ.46వేల నగదు, 8సెల్ ఫోన్లు,కారు,ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ దాడులు..

ఖమ్మంరూరల్,మే5(ఆంధ్రజ్యోతి): పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన ఖమ్మంరూరల్ మండలం, తీర్థాలలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొందరు తీర్థాల గ్రామం సమీపంలోని ఓ మామిడి తోటలో పేకాట ఆడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.13 వేల నగదు, 6మొబైల్‌ఫోన్లు, 5ద్విచక్రవాహనాలు, ఆటోను సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు.

నేడు వాహనాల వేలం

ఖమ్మంసంక్షేమవిభాగం, మే5(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం వేలంద్వారా అమ్మకాలు జరుపుతామని ఉమ్మడి ఖమ్మంజిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్1లో ఆరు ద్విచక్ర వాహనాలు, ఖమ్మంఎక్సైజ్ స్టేషన్2 పరిధిలో 8వాహనాలు, సత్తుపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో1 వాహనానికి వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆయా కార్యాలయాల్లో ఉదయం 11గంటలకు వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందస్తుగా డిపాజిట్ చెల్లించాలన్నారు.

టేకు కలప పట్టివేత

దుమ్ముగూడెం,మే5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పైడిగూడెం గడ్డోరుగుంపులో నిల్వ ఉంచిన పదకొండు టేకు దిమ్మెలను దుమ్ముగూడెం అటవీరేంజి అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టారు. పట్టుబడిన టేకు దిమ్మెల విలువ రూ.1,38,668లక్షలు కాగా భద్రాచలం కలప డిపోకు తరలించారు. రేంజి అధికారి కమల, సిబ్బంది ఆదినారాయణ, జ్యోత్స్న తదితరులున్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

- పది వాహనాలు స్వాధీనం
- ఏపీలో దొంగిలించిన వాహనాలను నెంబరు ప్లేట్లు మార్చి అమ్మకం
- పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్

అశ్వారావుపేట,మే5(ఆంధ్రజ్యోతి):అశ్వారావుపేట పోలీసులు అంతరాష్ట్ర వాహనాల దొంగను అరెస్ట్ చేసి, 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడించారు. సోమవారం ఆయన అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో దొంగను, వాహనాలను ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెం మండలం, పుట్టకట్లగూడేనికి చెందిన ఆటో డ్రైవర్ ముత్యాల గణేష్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో దొంగతనాలు చేసేవాడు. సోమవాం అశ్వారావుపేటలో వాహనాల తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డట్టు తెలిపారు. అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 3, దమ్మపేట స్టేషన్ పరిధిలో 1, ఏపీలోని తడికలపూడి స్టేషన్ పరిధిలో 6 వాహనాలను దొంగిలించినట్టు విచారణలో ఒప్పుకున్నాడు. ఆ వాహనాలను స్వాధీనంలోకి తీసుకున్నట్టు డీఎస్పీ వెల్లడించారు. గణేష్ మద్యానికి, జలసాలకు, వ్యసనాలకు అలవాటు పడి వచ్చే ఆదాయం చాలక, దొంగతనాలకు పాల్పడుతున్నట్టు చెప్పారు. ఈ వాహనాలను నెంబరు ప్లేట్లు మార్చి తెలంగాణలో విక్రయించే ప్రయత్నం చేస్తుండగా, సమాచారం మేరకు పోలీసులు నిఘావేసి పట్టుకున్నట్టు తెలిపారు. దొంగను వాహనాలను పట్టుకున్న అశ్వారావుపేట సీఐ నాగరాజు, ఎస్ఐ యయాతిరాజు, అఖిల, క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రరావు, కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్

షార్ట్‌సర్క్యూట్‌తో ఫొటోస్టూడియో దగ్ధం

కారేపల్లి,మే(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫొటోస్టూడియో, జిరాక్స్ షాపు కాలిపోయింది. సూర్యతండా గ్రామానికి చెందిన దరావత్ రాందచందర్ చాలాకాలంగా బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ సామినేని రాఘవులు కాంప్లెక్స్‌లో ఫొటో స్టూడియో, జిరాక్స్ షాపు నిర్వహిస్తున్నాడు. అదివారం అర్ధరాత్రి దాటిన తరువాత షార్ట్ సర్క్యూట్ జరిగింది. రాత్రిసమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు విషయాన్ని గమనించి రాంచందర్‌కు సమాచారం ఇచ్చారు. ఇల్లెందు ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేసింది. అప్పటికే స్టూడియోలోని కంప్యూటర్లు,జిరాక్స్ మిషన్లు,కెమెరాలు పూర్తిగా కాలిపోయాయి. వీటి విలువ ఐదులక్షలకు పైగా ఉంటుందని రాంచందర్ తెలిపారు.



ప్రమాదంలో కాలిపోయిన స్టూడియో

మర్లపాడులో గిత్త మృత్యువాత

కల్లూరు: మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో సోమవారం ఓ గిత్త విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. మండల పరిధిలోని మర్లపాడు గ్రామానికి చెందిన శెట్టి సీతయ్య అనే రైతుకు చెందిన ఈ ఎద్దు గ్రామ పరిసరాల్లో మేత, తాగునీటి కోసం వచ్చింది. పొలాల సమీపంలో గల విద్యుత్ నియంత్రిక వద్దకు రాగానే విద్యుత్‌షాక్ గురై అక్కడిక్కడే మృతి చెందినది. దీనివిలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుంది. ఈ సంఘటనపై సదరు రైతు కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

గ్యాస్ లీకేజీ ఘటనలో..
మరొకరి మృతి

నాలుగుకు చేరిన మృతుల సంఖ్య



తల్లాడ,మే5(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో గ్యాస్ సిలిండర్ లీకైన ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాలిక గుంట్రు ప్రిన్సి(9) సోమవారం మృతిచెందింది. గతనెల 28న మిట్టపల్లి గ్రామంలో గుత్తికొండ వినోద్‌కుమార్ ఇంటిలో వంట గ్యాస్ లీకైన ఘటనలో వినోద్‌కుమార్‌తోపాటు అతడి కవల కుమారులు వరుణ్, తరుణ్ నాయనమ్మ సుశీల, మేనకోడళ్లు ప్రిన్సి, లిమ్సీ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో సుశీల ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో, హైదరాబాదులో చికిత్స పొందుతూ తరుణ్ మృతిచెందారు. గతనెల30న హైదరాబాదు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వరుణ్ మృతిచెందాడు. సోమవారం హైదరాబాదు ఉస్మానియా ఆసుపత్రిలో బాలిక ప్రిన్సీ కూడా మృతి చెందింది.

మావోయిస్టుల పేరిట వసూళ్లు

- ఇద్దరు అరెస్టు.. రూ.5వేల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను

గుండాల,మే5(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల పేరుతో ప్రముఖులను, వ్యాపారులను బెదిరిస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని గుండాలలో అదుపులోకి తీసుకున్నట్లు ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను పేర్కొన్నారు. సోమవారం గుండాల పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఆళ్లపల్లి మండలం నడిమిగూడెం గ్రామానికి చెందిన పాయం రాజేందర్ గతంలో ప్రజాప్రతిఘటన దళంలో పనిచేసి ఆళ్లపల్లి పోలీస్‌ల ఎదుట లొంగిపోయాడు. గుండాల మండలం ఘనాపురం గ్రామానికి చెందిన కల్తి పాపయ్య ఓ హత్యాయత్నం కేసులో నిందితుడుగా జైలుకు వెళ్లాడు. వీరిద్దరూ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించేందుకు మావోయిస్టు పార్టీ పేరుచెప్పి అక్రమ వసూళ్లకు తెరలేపారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని ప్రముఖులు, వ్యాపారుల ఫోన్‌నంబర్లు తెలుసుకొని మూడు నెలల నుంచి ఫోన్లు చేస్తూ మావోయిస్టు పార్టీ ఫండ్ కావాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు. వారిపై నిఘా ఉంచినప్పటికి తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం తూరుబాక వద్ద ఎస్సై సైదా రహూఫ్ తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించామని తెలిపారు. వారి నుంచి రూ.5వేల నగదు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. వారిని పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ రవీందర్, ఎస్సై సైదా రహూఫ్, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లులను అయన అభినందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మావోయిస్టు ఉనికి లేదని, నిషేధిత మావోయిస్టులది కాలం చెల్లిన సిద్ధాంతాలని పేర్కొన్నారు. ఎవరైనా మావోయిస్టు పేరుతో ఫోన్లు చేసి బెదిరించినా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రబాను

హైకోర్టు న్యాయాధికారి ప్రియదర్శిని మృతికి సంతాపం

ఖమ్మంలీగల్,మే5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయాధికారి ఎం.జీ ప్రియదర్శిని మృతి పట్ల న్యాయశాఖ ఉద్యోగులు సంతాపం తెలిపారు. వారి అకాల మరణం ఉద్యోగులకు తీరని లోటని, ఖమ్మం కుటుంబ న్యాయస్థానంలో న్యాయాధికారిగా ఉన్నప్పుడు సోదరభావంతో మెలిగేవారని గుర్తు చేసుకున్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సత్వర న్యాయానికి కృషి చేశారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుశ్రీరత్నాకరం శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజ్ సెక్రెటరీ నాగుల్ షరీఫ్, అసోసియేట్ అధ్యక్షుడు కే.శ్యామ్, ఉద్యోగులు ఉన్నారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరు అరెస్టు

ఇల్లెందుటౌన్,మే5 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం వైపు నుంచి ఇల్లెందు వైపుకు అక్రమంగా తరలివస్తున్న గంజాయిని ఇల్లెందు పోలీసులు పట్టుకున్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ఈ వివరాలను వెల్లడించారు. ఒడిషాకు చెందిన కవలందారా అలియాస్ సందీప్‌కుమార్ ఆదేశాల మేరకు విశ్వాల్ వద్ద నుంచి జగిదాబాద్‌కు ఆటోలో గంజాయి తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు ఇల్లెందు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని బొజ్జాయిగూడెం వద్ద తనిఖీ చేశారు. ఆటోతోపాటు అందులో ఉన్న 111కేజీల గంజాయి ఉన్నట్లుగా గుర్తించారు. దీని విలువ రూ.55లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. గంజాయితో పాటు మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇల్లెందుకు చెందిన సపావత్ వెంకన్న, కామారెడ్డికి చెందిన మూడు శ్రీనివాస్‌లను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

బోనకల్,మే5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లపాడు గ్రామంలో అక్రమంగా ఇసుక తోలకాలు జరుపుతున్న రెండు ట్రాక్టర్లను సోమవారం ఎస్ఐ పి.వెంకన్న సీజ్ చేశారు. బ్రాహ్మణపల్లి, మోటమర్రి ఏటినుంచి అక్రమంగా ఇసుకను గార్లపాడు గ్రామానికి తీసుకువస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. వీరభద్రం, గోపిలపై కేసు నమోదు చేశారు.



కామేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడిగా సత్యనారాయణ



కామేపల్లి, మేర్(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడిగా తాళ్ల గూడెం గ్రామానికి చెందిన పుచ్చకాయల సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కొత్తలింగాల ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, మహబూబాబాద్ పార్లమెంటరీ కన్వీనర్ కొండాబాల రాంచందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా బానోత్ దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లంకి నవీన్‌ను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో కొమ్మిన్ని సత్యనారాయణ, అజ్మీరా హరినాయక్, పుచ్చకాయల రామక్రిష్ణ, చెరుకుపల్లి నర్సింహరావు,చైతన్య, సుందర్‌రావు, ఉపేందర్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



ఖమ్మం కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజల అర్జీలకు ప్రాధాన్యతను ఇచ్చి తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు జవాబుదారీగా అధికారులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు డీడీ సత్యనారాయణ, జ్యోతి, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి, మిషన్‌భగీరథ ఈఈ పుష్పలత, ల్యాండ్‌సర్వే ఏడీ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏఓ అరుణ పాల్గొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- రాంక్యాతండాలో 'రైతుల ముంగిట్లోకి వ్యవసాయ శాస్త్రవేత్తలు'



రైతు సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రఘునాథపాలెం,మేర్ (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో డిమాండ్‌కు తగిన పంటలు సాగు చేయటం ద్వారా రైతులకు మంచి ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య ఆధ్వర్యంలో రైతుల ముంగిట్లోకి వ్యవసాయశాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ పూర్వం చేసిన వ్యవసాయ విధానాలే ఇప్పుడు తిరిగి చేపట్టాలన్నారు. సేంద్రియ వ్యవసాయ విధానం వల్ల ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. సాగులో రసాయనాలు వాడకం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. వ్యవసాయ విధానంలో ఆధునికత, తక్కువ శ్రమ, పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వంటి అనేక అంశాలను రైతులకు నేరుగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. భూమి రకం, నేలస్వభావం, తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు నేరుగా వ్యవసాయశాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. నూతన సాగు విధానాలను అమలు చేస్తున్న రైతుల్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సన్మానించారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రవికుమార్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వరరావు, మంచుకొండసొసైటీ అధ్యక్షుడు మందడపు సుధాకర్, ఖమ్మం ఆత్మకమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం సొసైటీ ఛైర్మన్ అధ్యక్షులు తాతా రఘురాం తదితరులు పాల్గొన్నారు.

బాలల సదనం అభివృద్ధి పనుల పరిశీలన

ఖమ్మంఖానాపురంహవేలి: నగరంలోని బాలల సదనంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ప్రభుత్వ విద్యలో వివిధ తరగతుల పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన బాలల సదనం పిల్లలను కలెక్టర్ అభినందించారు. అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. వాల్‌పెయింటింగ్, శిథిల గదుల తొలిగింపు వలన విశాలమైన ప్లేగ్రౌండ్‌తో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టులను పరిశీలించారు. పిల్లల మనస్సు ప్రశాంతంగా ఉండేలా చిత్రాలను చిత్రీకరించాలని, ఏసీ పనులను, మొక్కల పెంపు, గ్రీనరీ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, బాలల అభివృద్ధి అధికారి విష్ణువందన, బాలల సదనం అధికారి వరలక్ష్మీ, మునిసిపల్ ఈఈ కృష్ణలాల్ తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ తొలిదశ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి, మే5 (ఆంధ్రజ్యోతి): డిగ్రీప్రథమ సంవత్సరంలో చేరటానికి డిగ్రీఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ దోస్త్ ద్వారా తొలిదశ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్.జాకీరుల్లా అన్నారు. సోమవారం కళాశాలలో దోస్త్ ప్రవేశాల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల21వరకు తొలివిడత ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈనెల 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చునని తెలిపారు.ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం హాల్‌టికెట్, ఆధార్‌కు లింకైన ఫోన్‌నెంబర్,పదోతరగతి,ఇంటర్ మెమోలు, 6నుంచి10వ తరగతి వరకు స్టడీసర్టిఫికెట్ల జీరాక్స్‌లు, ఇంటర్ టీసీ, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849841555, 9618896949 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దోస్త్ కోఆర్డినేటర్ సలీంపాషా, వైస్ ప్రిన్సిపాల్స్ శాస్త్రీ, బానోత్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

స్తంభాద్రి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మురళీ, మాజీ కార్పొరేటర్ చావా

ఖమ్మంసంక్షేమవిభాగం, మే5 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో విద్యార్థులు, తల్లి, దండ్రులు సుదూర ప్రాంతాలకు విజ్ఞాన ప్రాంతాలను చూసేందుకు వెళ్లకుండా ఖమ్మం నగరంలోనే స్తంభాద్రిట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయటం అభినందనీయమని కార్పొరేటర్ కమర్తపు మురళి, మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు పేర్కొన్నారు. సోమవారంఖమ్మం ప్రభుత్వ డిగ్రీకాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన కశ్మీర్ సెట్టింగ్‌తో కూడిన ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించారు. విద్యార్థులకు వినోదాత్మకంగా ఆటలు, ఉల్లాసం వంటి పరికరాలను అందుబాటులో ఉంచారని తెలిపారు. కాశ్మీర్‌షో, జలకన్యలు, జాయింట్ వీల్స్ ఆకట్టుకున్నాయి. ఎగ్జిబిషన్ నిర్వాహకులు తుమ్మా అప్పిరెడ్డి, అమర్లపూడి బాలశౌరి, వాసు, మహేష్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మధు పరామర్శ

తిరుమలాయపాలెం, మే5 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన మృతుల కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ సోమవారం పరామర్శించారు పిండిప్రోలులో ఎన్డీనేత రావూరి సురేందర్,నాగేందర్, అంగడి పద్మ, కిలారు వెంకయ్య, గోపోజు జార్జిని పరామర్శించారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న,తాతా రవీందర్, చామకూరిసురేందర్, అంగడి వీరస్వామి పాల్గొన్నారు.

అక్రమ వలసదారులను పంపించాలని వినతి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు
- సీపీ, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాల అందజేత



సీపీకి వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంస్పోర్ట్స్, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశీయులను గుర్తించి వారిని వెంటనే వారి దేశాలకు పంపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌కు వినతిపత్రం అందించారు. జిల్లాలోని అన్నిమండలాలలో పోలీసులు, పాలనా అధికారులు కార్డన్‌సెర్చ్ నిర్వహించి ఇతర దేశాల అక్రమ వలస దారులను గుర్తించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సన్నె ఉదయ్‌ప్రతాప్ ఇవి. రమేష్, శీలం పాపారావు, నున్నా రవి, అల్లిక అంజయ్య, విజయ్‌రాజ్ ఉన్నారు.

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి: ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల బీజేపీ నాయకులు సోమవారం సాయంత్రం తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు.. దేశంలో ఉగ్రవాదులను సమూలంగా నాశనం చేయాలని, భారత్‌లో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ అంతు తేల్చాల్సిందేనని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో భవనాశి దుర్గారావు, మన్నె కృష్ణారావు, పాగర్తి సుధాకర్, తోగటి నాగాచారి, కల్యాణం నాగేశ్వరరావు, నాగసాయి, వెంకటేష్, గోపి తదితరులు ఉన్నారు.

ముగిసిన ఎల్‌ఆర్ఎస్ గడువు

- కేఎంసీకి రూ.54 కోట్ల ఆదాయం
- తొలిస్థానంలో వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్
- మూడోస్థానంలో ఖమ్మం



ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలిస్తున్న సిబ్బంది(ఫైల్)

ఖమ్మంసంక్షేమవిభాగం, మే5(ఆంధ్రజ్యోతి): ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్ఎస్)ఆదాయ రాబడిలో ఖమ్మం నగర పాలక సంస్థ భేష్ అనిపించుకుంది. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ సెలవ్ రోజుల్లోను ఎల్‌ఆర్ఎస్ కౌంటర్లను కొనసాగించారు. ఫిబ్రవరి 24నుంచి మే 3 వరకు క్రమపద్ధతిలో ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించారు. ఖమ్మంనగరంలోని ప్రధాన సెంటర్లలో ఎల్‌ఆర్ఎస్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇళ్ల స్థలాలు కలిగిన దరఖాస్తుదారులకు క్రమబద్ధీకరణపై అవగాహన చేశారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 40,181 దరఖాస్తులు ఎల్‌ఆర్ఎస్ కోసం ఆన్‌లైన్‌లో అందాయి. వాటిలో ఫీజు చెల్లింపుల కోసం 29,322 దరఖాస్తులు అర్హత పొందాయి. వాటిలో 11,999 ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను ఖమ్మం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు ఆమోదం తెలిపారు. 3,890దరఖాస్తులకు ప్రొసిడింగ్స్ పంపిణీ కూడా జరిగింది. దీంతో ఖమ్మంనగరపాలక సంస్థకు ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ ద్వారా రూ.54కోట్ల58లక్షలు ఆదాయం వచ్చింది. రాష్ట్రంలో వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రథమస్థానంలో నిలవగా, పెద్దఅంబారుపేట నగరపాలక సంస్థల రెండోస్థానంలో, కేఎంసీ మూడుస్థానంలో నిలిచింది.

కార్పొరేట్ సెలూన్లను మూసివేయాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, మేర్(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి నాయీ బ్రాహ్మణుల జీవనో పాధిని దెబ్బతీస్తున్న కార్పొరేట్ సెలూన్లను వెంటే మూసివేయాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నాచౌక్‌లో ధర్నానిర్వహించారు. నగరంలోని పెవిలియన్‌గ్రౌండ్ నుంచి జడ్పీసెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించి బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈధర్నాకు పలు రాజకీయపార్టీలు, కులసంఘాల, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా సంఘం నగర అధ్యక్షుడు యలమందల జగదీష్ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల కులవృత్తి పై వారికే పేటెంట్ హక్కు కల్పించి, ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. కార్పొరేట్ సంస్థలు ఏర్పాటుచేస్తున్న సెలూన్లను మూసివేసేవరకు పోరాటం ఆగదన్నారు. వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు.

అవగాహనతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ

సాంకేతిక డీఈ బాబూరావు, ఏడీఈ సంజీవ్‌కుమార్

రఘునాథపాలెం,మే5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు సరైన అవగాహనతోనే విద్యుత్‌ప్రమాదాల నుంచి రక్షణ పొందుతారని, విద్యుత్‌శాఖ ఉద్యోగులు ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సాంకేతిక డీఈ బాబూరావు, ఏడీఈ సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం రఘునాథపాలెం సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాల నివారణ, వ్యక్తిగత భద్రతా, పరికరాలు వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంశాలపై వారు వివరించారు. ఈ సందర్భంగా మంచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి బాలకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరిగిన సమయంలో సీపీఆర్ విధానాన్ని వివరించారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసా

- ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం

కామేపల్లి, మే5(ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం సహాయనిధి భరోసా అని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం కామేపల్లి రైతువేదికలో 86మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో కంటే మన ప్రజాపాలన ప్రభుత్వంలో వేలమందికి సహాయనిధి అందుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలనపై ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నం మనుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో గింజల నర్సింహరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, పీఏసీఎస్ ఛైర్మన్లు హన్మంతరావు, పీ. వీరభద్రం,డీఎస్, నల్లమోతు లక్ష్మయ్య,జగన్నాథరెడ్డి, గుజ్జర్లపుడి రాంబాబు, బావ్‌సింగ్, గబ్రూ, ప్రేమ్, బోడ రాజేష్ పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన సైదులు



ఖమ్మంఖానాపురంహవేలి, మే5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చీఫ్‌సెక్రటరీ కె.రామకృష్ణను సోమవారం హైదరాబాద్‌లో ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ. సైదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యో, ఉపాధ్యాయుల సమస్యలు, రావాల్సిన బకాయిలు చెల్లించుటకు నూతన పీఆర్సీని ఏర్పాటు చేయుటకు కృషి చేయాలని కోరారు.

సన్నబియ్యంతో లబ్ధిదారుల్లో ఆనందం

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు



కోరట్లగూడెంలో సన్నబియ్యంతో లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న రాయల

నేలకొండపల్లి, మే5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో పేదల్లో ఆనందం వ్యక్తమవుతుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మధ్యాహ్నం మండల పరిధిలోని కోరట్లగూడెంలో కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు అధ్యక్షుడు బచ్చలకూరి నాగరాజు ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సన్నబియ్యాన్ని అందిస్తున్నట్లు రాయల చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తోందని, ఇది పేదల ప్రభుత్వమని రాయల అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, కుక్కల హనుమంతరావు, బచ్చలకూరి నాగరాజు, కొడాలి గోవిందరావు, జెర్రిపోతుల అంజని,దోసపాటి శేఖర్, యడవల్లి నాగరాజు, రేగూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాయల జన్మదిన వేడుకలు

రాయల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను సోమవారం మండలంలో నిర్వహించారు. కేక్ కట్ చేశారు. నేలకొండపల్లి సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు మంగళ, రాజేష్, వైద్య శాలసిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని వినతి

తిరుమలాయపాలెం, మే5(ఆంధ్రజ్యోతి): మండలంలో నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయాలని తహసీల్దార్ సుధీర్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్‌లకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందించారు. ప్రజవాణి కార్యక్రమంలో భాగంగా అధికారులకు వినతి పత్రం అందించారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో నిజమైన లబ్ధిదారులకు ఇళ్లురావడంలేదని, అనర్హులకు ఎంపికచేస్తున్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, టి.నాగేశ్వరరావు, ఉపేందర్, అరవయ్య, సత్యనారాయణ, మల్లయ్య, రాము పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

వనమహోత్సవానికి లక్ష మొక్కల పెంపకం

ఖమ్మంసంక్షేమవిభాగం,మే5(ఆంధ్రజ్యోతి):వనమహోత్సవానికి ఖమ్మం నగర పాలక సంస్థ తరుపున ఇప్పటికే మొక్కలు పెంపకం జరుగుతుందని కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని గొల్లగూడెం ప్రభుత్వ నర్సరీలను తనిఖీలు చేశారు. మొక్కలు పెంపకంపై పలు సూచనలు చేశారు. నగరంలో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచనల మేరకు ఇప్పటికే లక్ష మొక్కల పెంపకాన్ని చేపట్టినట్లు తెలిపారు. వనమహోత్సవంలో ఇంటింటికి మొక్కలు అందించేందుకు కార్యాచరణ జరుగుతుందన్నారు.



మొక్కలు పరిశీలిస్తున్న కేఎంసీ ఉద్యాన అధికారి రాధిక

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు ఊరట

ఖమ్మంరూరల్, మే5(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్‌తో నిరుపేదలకు ఎంతో ఊరట కలుగుతుందని కాంగ్రెస్ నాయకులు తుంబూరి దయాకర్ రెడ్డి, మద్దినేని స్వర్ణకుమారి అన్నారు. వివిధ గ్రామాల్లో సంబంధించిన లబ్ధిదారులకు మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం చెక్కులు అందజేశారు. మొత్తం 113 మందికి రూ.40 లక్షల చెక్కులు అందజేశామన్నారు. నియోజవకర్గంలోని అన్ని గ్రామాలలో మౌలికవసతులు కల్పించేందుకు మంత్రి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న దయాకర్‌రెడ్డి

రైతులకు బహుప్రయోజనం విశిష్ట సంఖ్య

ఏడీఏ శ్రీనివాసరెడ్డి



కొత్తూరులో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి, మే5 (ఆంధ్రజ్యోతి): రైతులకు మంజూరయ్యే ప్రభుత్వ పథకాలలో లబ్ధిచేకూరాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ టీ.శ్రీనివాసరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని కొత్తూరు, గంగారం, కాకర్లపల్లి రైతువేదికల వద్ద పోర్టల్‌లో నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. నెల రోజుల పాటు గ్రామాల వారీగా ఏఈవోల ఈ నమోదు ప్రక్రియను చేపట్టనుండగా ప్రతీరైతు 11అంకెల రైతు గుర్తింపు సంఖ్యను పొందాలని సూచించారు. ఈఏడాది జనవరి 1వ తేదీ నాటికి డిజిటల్ సైన్ అయిన ప్రతిరైతు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్‌ను తీసుకొని వ్యవసాయాధికారిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో వై.శ్రీనివాసరావు, ఏఈవోలు టీ.నరేష్, ఎస్.అనూష, ఐ.సాయివాసంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైరా, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11అంకెలతో విశిష్ట సంఖ్య(యానికోడ్)ను కేటాయించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. దానిలో భాగంగానే సోమవారం వైరా మండలంలోని ఐదు గ్రామాల్లో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని దాచాపురం, కొండకొడిమ, అష్ణగుర్తి, నారపనేనిపల్లి, తాటిపూడి గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజూఖాన్ మాట్లాడుతూ రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు వాసంతి, వెంకటనర్సయ్య, సైదులు, కీర్తి పాల్గొన్నారు.



వైరాలో మాట్లాడుతున్న ఏవో మయాన్ మంజూఖాన్

పెనుబల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఆధార్ తరహాలో ప్రతి రైతుకు ఉన్న భూమికి సంబంధించిన వివరాలతో కూడిన గుర్తింపుకార్డుల కోసం ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని సోమవారం పెనుబల్లి మండలంలో వ్యవసాయ అధికారి ఏవీవీఎ.ప్రసాద్‌రాజు ప్రారంభించారు. మండలంలోని అన్ని రైతువేదికల్లో ఏఈవోలు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు ఆధార్‌కార్డు, భూయాజమాన్య పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డుకు లింక్ అయిన మొబైల్ ఫోన్ నెంబర్‌ను తీసుకొని ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.



తాళ్లపెంటలో మాట్లాడుతున్న ఏఈవో నాగరాజు

భూ భారతితో సమస్యల పరిష్కారం

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

బోనకల్, మే 5 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే భూభారతి చట్ట లక్ష్యమని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని గార్లపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి స్వయంగా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అమలుకు సంబంధించి రెవె న్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఈ చట్టం ద్వారా రెండెంచల అప్పీలు వ్యవస్థ ఉంటుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రెవెన్యూ సేవలు అందిస్తామని తెలిపారు. పెండింగ్ సాదాబైనామా, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, నిషేధిత భూములు, ఆర్‌వోఆర్‌లో మార్పులు, చేర్పులు లాంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సదస్సులో 67 మంది రైతులు దరఖాస్తులను ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ పున్నం చందర్, గిర్దావర్ మైథిలి, ఆత్మకమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ మోదుగు సుధీర్ పాల్గొన్నారు.

నిఘా నేత్రాల పర్యవేక్షణలో మధిర పట్టణం

ట్రైయినీ ఐపీఎస్, మధిర టౌన్ ఎస్‌హెచ్‌వో రుత్విక్ సాయి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ట్రైయినీ ఐపీఎస్

మధిరటౌన్, మే5(ఆంధ్రజ్యోతి): నిఘా నేత్రాల పర్యవేక్షణలో మధిర పట్టణం ఉంటుందని ట్రైయినీ ఐపీఎస్, మధిర టౌన్ ఎస్‌హెచ్‌వో కొట్టె రుత్విక్ సాయి అన్నారు. సోమవారం మధిర పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మధిర పట్టణంలోని 44 ప్రధాన కూడళ్ల లో ఇక పై ఎటువంటి సంఘటన జరిగినా సీసీ కెమెరా లలో రికార్డు అయ్యేలా అధునాతన టెక్నాలజీ గల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీజ మధిర మునిసిపాలిటీ నుంచి రూ.4.30 లక్షలను మంజూరు చేయించారని, ఇకపై ఎటువంటి సంఘటనలైనా వీటి ద్వారా గుర్తించ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు చంద్రశేఖర్, లక్ష్మీభార్గవి సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

సత్తుపల్లిరూరల్, మే5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదానికి గురై ఇంటివద్దే ఉంటున్న స్థానిక జవహర్‌నగర్‌కు చెందిన కలపాల నాగేంద్రను ఆదివారం రాత్రి కమ్మ సేవా సమితి పరామర్శించారు. ఆర్‌కే ఫౌండేషన్ బాధ్యులు ఇనపనూరి రాధాకృష్ణ ద్వారా కమ్మ సేవా సమితి బాధ్యులు మట్టా అజయ్, చల్లగుళ్ల నరసింహారావులు తెలుసుకొని ఆ కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వైద్య ఖర్చుల అవసరమైతే స్థానిక ఎమ్మెల్యే ద్వారా సహాయం చేయిస్తామని హామీ ఇవ్వడంతో నాగేంద్ర కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ముదిగొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. నిజమైన అర్హులను ఎంపిక చేయలేదని, అనర్హులకే ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. అనంతరం ఎంపీడీవో వాల్మీకి కిషోర్, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులు పోట్ల వెంకటప్రసాద్, బంకా మల్లయ్య, సెల్వరాజ్, ఖాజా, కొమ్మూరి రమేష్, శంకర్, పోటు ప్రసాద్, వెంకట్రావ్, భిక్షం పాల్గొన్నారు.

ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా వెంకటేశ్వర్లు



పెనుబల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ తమ సర్టిఫైడ్ ట్రైనర్‌గా టేకులపల్లి ఆదర్శ పాఠశాల తెలుగు అధ్యాపకుడు పర్సా వెంకటేశ్వర్లును గుర్తిస్తూ సర్టిఫికెట్ జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ రూపస్ తెలిపారు. నెలరోజులపాటు వెంకటేశ్వర్లు ఆయా అంశాల్లో విద్యార్థి, యువత, వయోజనులకు శిక్షణ ఇచ్చి 98శాతం స్కిల్‌ను నేర్పించినందుకుగానూ గుర్తించారు. ఆదివారం ఖమ్మం లో జరిగిన రీజియన్ త్రీ ట్రైనర్ క్యాంపులో వెంకటేశ్వర్లుకు అవార్డును అందజేశారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మధిరరూరల్, మే5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సీపీఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ కోరారు. సోమవారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పెరుమాళ్లపల్లి ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈసభలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మందడపు రాణి, సింగు నరసింహారావు, మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు పట్ల హర్షం

కారేపల్లి, మే5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో బీసీ హాస్టల్ నిర్మాణం కోసం ఇటీవల అధికారులు స్థలం కేటాయించారు. కాగా కేటాయించిన ప్రభుత్వ భూమిని ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు బీజేపీ జిల్లా నాయకుడు తురక నారాయణ ఆధ్వర్యంలో ఇటీవల కలెక్టర్‌ను కలిసి ఇనుపకంచె ఏర్పాటు చేయించాలని కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ వెంటనే రూ.3లక్షలను మంజూరు చేశారు. మంజూరైన నిధులతో గ్రామస్థుల సహకారంతో సోమవారం నారాయణ ఆధ్వర్యంలో ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కేతిమాల శ్రీను, పాలిక ముత్తయ్య, తురక సాంబయ్య, పోతు వెంకటేశ్వర్లు, మజిరొండ సత్యం తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి మృతికి సంతాపం



సంతాపం తెలుపుతున్న న్యాయమూర్తి, న్యాయవాదులు

మధిరటౌన్, మే5(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి గిరిజ ప్రియదర్శిని ఆకస్మిక మృతికి సోమవారం మధిర కోర్టు న్యాయమూర్తి, న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధిర కోర్టు లో జరిగిన కార్యక్రమంలో సీనియర్ న్యాయమూర్తి ప్రశాంతి, జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తిలు మాట్లాడుతూ గిరిజ రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది పేద వారికి రాష్ట్ర న్యాయసేవ సంస్థ ద్వారా న్యాయం జరిగేలా కృషి చేశారని కొనియాడారు. మానవీయ విలువలు, విలక్షణమైన తీర్పులతో ఆమె అనేక మంది మన్ననలు పొందారని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లారావు పాల్గొన్నారు.

పంట మార్పిడితో ప్రయోజనాలు


వ్యవసాయ శాస్త్రవేత్త రుక్మిణీదేవి

మధిరరూరల్, మే5(ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి చేయడం ద్వారా పంటలకు వచ్చే చీడపీడలు తగ్గించుకోవచ్చని మధిర వ్యవసాయపరిశోధన స్థానం శాస్త్రవేత్త రుక్మిణీదేవి అన్నారు. సోమవారం ప్రభుత్వం రైతాంగానికి సాగుసంబంధిత అంశాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఏవో సాయిదీక్షిత్, ఏఈవో సుష్మ పాల్గొన్నారు.

తొర్లపాడు లిఫ్టుకు నిధులు మంజూరు చేయాలి

మధిరరూరల్, మే5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లపాడు గ్రామాల్లో కట్టలేరు సమీపంలో ఉన్న లిఫ్టు ఇరిగేషన్ స్కీం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని రైతు సంఘం మధిర డివిజన్ నాయకుడు పాపినేని రామనరసయ్య కోరారు. సోమవారం మధిర మండలం తొర్లపాడు గ్రామంలో రైతులు, ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామలోని లిఫ్టు మరమ్మతులకు నిధులు మంజూరుచేస్తే రైతుల పంట పొలాలకు నీరందుతుందన్నారు. ఉపాధి హామీకూలీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు మద్దాల ప్రభాకర్, వూట్ల శంకరరావు పాల్గొన్నారు.

'దేశానికి వలసవచ్చిన వారిని గుర్తించాలి'



శివకృష్ణ, రహ్మతుల్లాను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సత్తుపల్లిరూరల్, మే5 (ఆంధ్రజ్యోతి): రోహింగ్యాలు, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుంచి వలస వచ్చిన వారిని కార్డన్ సెర్చ్ ద్వారా గుర్తించాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు. సోమవారం సత్తుపల్లి తహసీల్దార్, పట్టణ సీఐలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎన్టీఆర్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ, డిస్ట్రిక్ట్ కౌన్సిల్ మెంబర్ ఎస్‌కే.రహ్మతుల్లాలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పడిగల మధుసూదన్‌రావు, జోన్నలగడ్డ నరేష్, ఆచంట నాగస్వామి, బానోత్ విజయ్, చీకటి వసంతరావు, మందా శివతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొణిజర్ల, మే5(ఆంధ్రజ్యోతి): భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానియులను తక్షణమే బహిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి బండరు నరేష్, మండల అధ్యక్షులు కవిడ మురళీకృష్ణ, తుప్పతి మల్లిఖార్జున్, నరేష్, రాంబాబు, రాజేష్, బాలకృష్ణ, శంకర్, సత్యనారాయణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు



వైరాలో భద్రతా వారోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న డీఈ శ్రీనివాసరావు, విద్యుత్ సిబ్బంది

వైరా/మధిరటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాలను ట్రాన్స్‌కో డీఈ బండి శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. టీజీఎన్‌పీడీసీఎల్ ఆదేశాల మేరకు వైరా, మధిరలో సబ్‌డివిజన్ స్థాయిలో వారోత్సవాలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల ప్రాముఖ్యతను డీఈ శ్రీనివాసరావు సిబ్బందికి వివరించారు. విద్యుత్ సరఫరాలో లోపాలు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసేటప్పుడు, ఇతర విద్యుత్ మరమ్మతుల నిర్వహణ, భద్రతా ఉపకరణాల వినియోగం, భద్రతా ప్రమాణాలు పాటించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. ఆయా కార్యక్రమాలలో ఏడీఈ పి.కిరణ్‌కుమార్, ఏడీఏ అనురాధ, వైరా టౌన్, రూరల్, బోనకల్ ఏఈలు పి.సుందర్‌కుమార్, పాలేటి వెంకటసాయి, మనోహర్, అధికారులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో మాట్లాడుతున్న డీఈఈ రాములు

సత్తుపల్లిరూరల్‌లో...

సత్తుపల్లిరూరల్, మే5 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ముందస్తు జాగ్రత్త లేకుండా నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పు తప్పదని విద్యుత్ శాఖ డీఈఈ ఎల్.రాములు అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రసాద్, ఏఈలు యూ.శరత్‌బాబు, కావ్య, అంకారావు సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరులో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

కల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కల్లూరులో సోమవారం చిన్నకోరుకొండి గ్రామానికి చెంది న పలువురు మహిళలు తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న మహిళలు మాట్లాడుతూ చిన్నకోరుకొండి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు 42 మంజూరు కాగా, అందులో అనర్హులు కూడా ఉన్నారని వారు ఆరోపించారు. ఆర్థిక స్థోమత కలిగి వ్యవసాయ భూములు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని బాధిత మహిళలు చెప్పారు. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై అధికారులు విచారణ జరిపి, నిరుపేదలైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టమైన రీతిలో వ్యవహరిస్తూ తప్పుల తడకగా జాబితాలను తయారు చేశారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జంపాల కృష్ణకుమారి, జిల్లెల నాగమణి, జ్యోతి. రాములమ్మ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు సమస్యను పరిష్కరించాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్

తల్లాడ, మే5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు సమస్యను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పలు గ్రామాలలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతుసంఘం నాయకులు పరిశీలించారు. ఈకార్యక్రమంలో శీలం సత్యనారాయణరెడ్డి, కళ్యాణం కృష్ణయ్య, అయిలూరి రామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కట్టా దర్గయ్య, జనార్ధన్ పాల్గొన్నారు.

వైరాలో...

వైరా: రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గన్నీసంచులను, కాంటాలు వేసిన తరలించేందుకు లారీలను సకాలంలో సమకూర్చాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావుకు సోమవారం ప్రజావాణిలో ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ వైరా మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపడా గన్నీసంచులను సరఫరా చేయడం లేదని పేర్కొన్నారు. రైతుసంఘం నాయకులు కిలారు శ్రీనివాసరావు, బాణాల శ్రీనివాసరావు, అమరనేని కృష్ణ, గుమ్మా నర్సింహారావు, రాజేష్, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన రబీ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం వైరాలో జరిగిన ఆపార్టీ డివిజన్ రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుర్రం అచ్చయ్య, ఏ.అశోక్, సీవై.పుల్లయ్య, అర్జున్‌రావు, యలదండి బాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సత్తుపల్లిరూరల్, మే5 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సమ్మెనె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కిన్లే ఫ్యాక్టరీలో సోమవారం సమ్మె నోటీస్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌కే.హుస్సేన్, సత్యనారాయణ, భాషా, బషీర్, శ్రీనివాసరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైరా, మే 5 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు సుంకర సుధాకర్, అనుమోలు రామారావు కోరారు. వైరాలోని ఐఎంఎల్ డిపో హమాలీ కార్మికులు సమ్మె నోటీసులు డిపో సూపర్‌వైజర్ రఘుకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు మల్లు పట్టయ్య, సైదులు, అప్పారావు, కిరణ్, నాగేశ్వరరావు, మధుకర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వైరా, మే 5 (ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్స చేయించుకున్న తమ మిత్రుడు నోముల రవికుమార్‌కు మెరుగైన వైద్యం నిమిత్తం తోటి మిత్రులు బాసటగా నిలిచారు. మండలంలోని రెబ్బవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1989 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల్లో నోముల రవికుమార్ అనారోగ్యం పాలై శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఆయన వైద్యఖర్చుల నిమిత్తం ఆపదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు రవికుమార్‌కు రూ.55వేల ఆర్థికసహాయాన్ని సోమవారం అందజేశారు. స్నేహితులు బాలబోయిన నర్సింహారావు, షేక్.ఇబ్రహీం, కస్తాల వినోదలక్ష్మి, బండారు జ్యోతి, మేడగాని కిరణ్ కుమార్, పల్లబోతు రవికుమార్, వెంకటగురునాథం పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపాలి: సీపీఎం

కారేపల్లి, మే5(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల అంతం పేరుతో గిరిజనుల ప్రాణాలు తీసే కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆపరేషన్‌ను ఆపాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం డిమాండ్ చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు భూక్య బాప్‌సింగ్ వర్ధంతి సభ మండల పరిధిలోని నానునగర్‌తండాలో యనమనగండ్ల రవిబాబు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ అటవీ సంపదను, ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని వ్యూహంలో భాగమే ఆపరేషన్ కగార్ అని విమర్శించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి కె.నరేందర్, అజ్మీర, శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

'సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి'

పెనుబల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇండోస్ కార్పొరేషన్ సంస్థ పేద ప్రజల నివాసాల సమీపంలో సెల్‌టవర్ నిర్మాణాన్ని చేపట్టిందని, దాని నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం లంకపల్లి గ్రామానికి చెందిన పేద గిరిజనులు, దళితులతో కలిసి రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ గంటా ప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రతాప్ మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడతామని, సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, తడికమళ్ల చిరంజీవి, కండే సత్యం, షేక్.ఖాసింబీ, షేక్.రాజీ, కృష్ణ, షేక్.దుర్గాబీ, రాణి, కె.నాగరత్నం, షేక్.శేఖర్, మౌలాలి, నాగేశ్వరమ్మ, జాన్‌బీ, సైదాబీ, మస్తాన్‌వలీ, అబ్దుల్లా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

7 నుంచి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఏన్కూరు, మే5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం గార్లొడ్డు శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయలో ఈనెల 7నుంచి 14వతేదీ వరకు జరిగే అధ్యయన, బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఈవో ఎన్‌వీడీ ప్రసాద్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7నుంచి 9వతేదీ వరకు అధ్యయనోత్సవాల, 10న బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 11న ఆదివారం స్వామివారి జయంతి సందర్భంగా 108కలశములతో అభిషేకం, మూలమంత్ర, మూర్తి మంత్రహసనం, గరుడాదివాసం, ధ్వజారోహణం, నివేదిన, తీర్థప్రసాద వినియోగం, స్తోత్రపారాయణం, బేరిపూజ, యాగశాల ఆరాధనమ, హోమం, బలిహరణ, 12న ఉదయం స్వామివారి ఎదుర్కోలు, రాత్రి 9గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. 13న స్వామివారి తిరువీధి ఉత్సవం, ఊరేగింపు జరుగుతుందన్నారు. 14న యాగశాల ఆరాధనలు, నిత్యహోమం, అభిషేకం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, నివేదన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అపూర్వ సమ్మేళనం

వైరా, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలోని 2013-14 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు గరికపాడు హైస్కూల్ ఆవరణంలో కలుసుకొని సందడి చేశారు. గత 11సంవత్సరాల కాలంలో తాము చదివిన చదువులు, చేస్తున్న పనుల గురించి ఒకరికొకరు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ఆనాటి గురువులు, సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. గరిడేపల్లి అనిల్‌కుమార్, అఖి ల్, ఉప్పల్, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు